

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 26.0

ఎందుకిలా.. మందకొడిగా!



వచ్చే మహానాడు లోపు అన్ని జిల్లాల్లోను సంస్థాగత ఎన్నికలను పూర్తి చేసేందుకు తెలుగుదేశం విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే ఈ ఎన్నికలకు సంబంధించి నిర్దిష్ట ప్రణాళికను పార్టీ సిద్ధం చేసింది. ఆ దిశగా గడువులోపే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాల్సిందిగా జిల్లా నాయకత్వాన్ని ఆదేశించింది. కుటుంబ సాధికార సారథులను ఎంపిక చేయడంలోనే పూర్తిగా ముందుకు వెళ్లలేక పోతున్నారు. గ్రామ, బూత్ కమిటీల ప్రక్రియ వైపు తొంగి చూడలేదు. స్థానికంగా ఉన్న సమన్వయలోపం ప్రధాన కారణం గానే కనిపిస్తోంది. వచ్చే నెల 15లోపే సంస్థగత ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా, తొలి దశ కూడా పూర్తి కాలేదు.

టీడీపీ సంస్థాగతంలో నిర్లిప్తత

- కార్యాచరణలో వెనుకబాటుతనం
- అధికారంలో ఉన్నాపార్టీలో తడబాటు
- కుటుంబ సాధికార సారథుల ఎంపికలోను ఆపసోపాలు
- ఒక్క ఏలూరు, దెందులూరుల్లోనే జోరంతా


(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

తెలుగుదేశంలో ప్రతీ కార్యకర్త ఆత్రుతగా ఎదురుచూసే ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడు పెద్ద ఎత్తున నిర్వహించే మహానాడు కోసమే. గతంలో ఉన్న పరిస్థితులకు భిన్నంగా ఈ మధ్యనే పార్టీ పరంగా సంస్థాగతంగా కొన్ని మార్పులు, చేర్పులు చేశారు. ఈ ప్రక్రియను వచ్చే నెల 15లోపే పూర్తి చేసే దిశగా కార్యాచరణ ప్రకటించారు.ఆ దిశగా వేగంగా ముందుకు కదలాల్సిందిగా సూచన చేశారు. పార్టీ అధికార పగ్గాలు చేపట్టిన అనంతరం జరగనున్న మహానాడు అత్యంత కీలకం కానుంది. అయితే ఓటర్లలో పార్టీ పరంగా మరింత ఇమిడి ఉండేలా కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతీ 60 మంది ఓటర్ల నుంచి ఒక మహిళ, మరో పురుషుడు చొప్పున ఇద్దర్ని కుటుంబ సాధికార సారథులుగా (కేఎస్ఎస్) గుర్తిం చాల్సి ఉంది. పార్టీ పరంగా అధ్యక్షుడి దగ్గర నుంచి దిగువ స్థాయి కార్యకర్త వరకు ఎట్టి పరిస్థితుల్లోను కుటుంబ సాధికార సారథులుగా ఉండి తీరాల్సిందే. ఈ ప్రక్రియ యావత్తును ఈ నెల 20వ తేదీ నాటికే పూర్తి చేయాల్సి ఉంది. తొలిసారి ఈ దిశగా అడుగులు వేస్తుండ టంతో క్షేత్రస్థాయిలో కొంత గందరగోళం ఏర్పడింది. నియోజకవర్గాల్లో ఇప్పటికీ పార్టీ ఆదేశాల ప్రకారం కుటుంబ సాధికార సారథులుగా పూర్తి స్థాయిలో నియమించలేని పరిస్థితి. తాజా సమాచారం ప్రకా రం కైకలూరు, పోలవరం పరిధిలో ఇంకా పూర్తిగా వెనుకబడి ఉన్నారు. మంత్రి పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజి వీడు నియోజకవర్గంలో మొత్తం కుటుంబ సాధికార సారథులుగా (కేఎస్ఎస్) గుర్తించాల్సి ఉన్నప్పటికీ ఇంకా 10 శాతం పైగానే ఎంపిక చేయాల్సి ఉంది. ఏలూరు నియోజకర్గంలో ఎమ్మెల్యే బడేటి చంటి చొరవ తీసుకున్నారు. నూటికి నూరు శాతం కేఎస్ఎస్‌ను ఎంపిక చేసి అగ్రస్థానంలో నిలిచారు. జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉంగుటూరు నియోజవర్గంలో ఇప్పటి వరకు 7వేలకు పైగా కేఎస్ఎస్‌లకుగాను సుమారు 4వేల మందిని మాత్రమే ఎంపిక చేయగలిగారు. ఈ నియోజకవర్గంలో మరో 40 శాతం మేర ఎంపిక చేయాలి. చింతలపూడి నియోజకవర్గంలో సుమారు 9వేల మందికి గాను ఇప్పటికే 75 శాతం మేర ఎంపిక చేయగలిగారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న దెందులూరు నియోజకవర్గంలో కాస్త దూకుడుగానే ఉన్నారు. ఇప్పటికే 7,712 కేఎస్ఎస్‌లకు 6,606 పైగానే ఎంపిక పూర్తి చేసి 89శాతం మేర లక్ష్యాలను అందుకోగలిగారు. ఇక కైకలూరు, పోలవరం నియోజకవర్గాల్లో పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఈ రెండు నియోజకవర్గాలకు సంబంధించి ఇంకా సమాచారం క్రోడీకరిస్తున్నారు.

• క్షేత్రస్థాయిలో కానరాని దూకుడు

తెలుగుదేశం పార్టీ పరంగా పిలుపునిస్తే చాలు క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నేతల్లో భారీ స్పందన కనిపించేది. ప్రతీ మహానాడులోను తమ ఇంటి పండుగగా భావించి ఉత్సాహంగా కార్యరంగంలోకి దిగేవారు. జిల్లాల వారీగా పోటీ పడేవారు. అధినేత చంద్రబాబు దృష్టిలో పడేందుకు విశ్వ ప్రయత్నం చేసేవారు. కానీ ఈ సారి పార్టీ అధికారంలో ఉన్నా సంస్థాగత ఎన్నికల నిర్వహణలో పార్టీలో కొంత నిర్లిప్తతే కనిపిస్తోంది. సుమారు మూడు వారాల క్రితమే సంస్థాగత ఎన్నికల తేదీలను ప్రకటించినా క్షేత్రస్థాయిలో ఇంకా మంద కొడిగానే వ్యవహారం సాగుతోంది. పార్టీలో యువతరంతో పాటు మిగతా వర్గాలకు అత్యంత ప్రాధాన్యత కల్పించే దిశ గానే మార్పులు, చేర్పులు చేసి కొత్త కుటుంబ సాధికార సారథులను తెరముందుంచారు. బూత్ దగ్గర నుంచి లోక్‌సభ నియోజకవర్గం కమిటీల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. ఈ కారణంగా పార్టీలో అత్యధిక పదవులను పొందేలా, కార్యకర్త లను మరింత ప్రోత్సహించేలా చేయాలని తలపెట్టారు. ఇప్ప టికే ఈనెల 20 నాటికి కుటుంబ సాధికార సారథులు ఎంపిక పూర్తి కావాల్సి ఉంది. జిల్లాలో ఒక్క ఏలూరు మినహా, మిగతా నియోజకవర్గాల్లో ఇప్పటికీ ఆ ప్రక్రియ పూర్తి చేయలేక పోయారు. కీలకమైన బూత్, గ్రామ కమిటీల నియామకాన్ని ఈ నెల 22న పూర్తి చేయాలని భావించినా, ఆ దిశగా ఇప్పటికీ ముందుకు సాగలేదు. ఇంతకుముందు పార్టీ పదవుల వైపే అత్యధికులు మొగ్గు చూపేవారు. శాసనసభ, పార్లమెంట్ నియోజకవర్గాల కమిటీల్లోను ఆసక్తి ప్రదర్శించేవారు. కానీ ఈ సారి మాత్రం క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితి నెలకొంది. మరో పక్షం రోజులే గడువు ఉండగా సంస్థాగత ఎన్నికలు, నియామకాల్లో తొలి అడుగు పూర్తిగా వేయలేని పరిస్థితి. తెలుగుదేశం పరంగా ఆది నుంచి ఏకపక్షంగా జిల్లా నాయకత్వం దగ్గరుండీ ఈ వ్యవహారం పర్యవేక్షించేది. అయితే ఈసారి కొన్ని నియోజకవర్గాల్లో జనసేన, బీజేపీలు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఆ ప్రభావం టీడీపీ సంస్థాగతంపై పడింది. కనీసం గడువు పొడిగించడానికి అవకాశం లేని పరిస్థితుల్లో మిగతా కమిటీ ఎన్నికల సకాలంలో పూర్తి చేయడం దుర్లభంగా ఉందని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి.

విధేయత, విశ్వసనీయతకు పెద్దపీట



- రాజ్యసభకు బీజేపీ అభ్యర్థిగా పాకా వెంకట సత్యనారాయణ
- ఆ పార్టీ ఏపీ కోర్ కమిటీ నిర్ణయం
- నేడు నామినేషన్ దాఖలు
- 45 ఏళ్లుగా పార్టీకి విశేష సేవలు
- పశ్చిమకు బీజేపీ మరింత ప్రాధాన్యం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భారతీయ జనతా పార్టీలో అత్యంత విశ్వసనీయత కలిగిన నాయకుడు పాకా వెంకట సత్యనారాయణ. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావజాలంతో అడుగులు వేసి బీజేపీలో చేరారు. రాష్ట్రస్థాయిలో ఎన్నో కీలక పదవులు నిర్వహించారు. ప్రతిసారీ చట్టసభల్లో పదవులు ఆయన తలుపు తట్టినా ఎన్నికలంటే వ్యయంతో కూడుకోవడంతో అదృష్టం వరించలేదు. పార్టీకి విశ్వసనీయ సేవలందించడం పాకా వెంకట సత్యనారాయణకు కలిసి వచ్చింది. దశాబ్దాలపాటు పార్టీకోసం చేసిన సేవలకు గుర్తింపు లభించింది. రాజ్యసభ అభ్యర్థిగా పాకా వెంకట సత్యనారాయణను ఏపీ కోర్ కమిటీ ఎంపిక చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా ఆయన ఎన్నిక కానున్నారు. రాజ్యసభ ఉప ఎన్నికలకు మంగళవారం నామినేషన్‌లు ప్రక్రియ ముగియనుంది. అదే రోజు పాకా సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేయనున్నారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో పాకా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. విద్యార్థి దశలో భారతీయ విద్యార్థి పరిషత్‌లో కీలకంగా వ్యవహరించారు. అప్పటి నుంచి బీజేపీ భావజాలంతో రాజకీయంగా అడుగులు వేశారు. పాకా 1976లో ఆర్ఎస్ఎస్‌లో, 1980లో బీజేపీ క్రియాశీల సభ్యునిగా సేవలందించారు. అప్పటినుంచి క్షేత్ర స్థాయిలో పదవులు చేపడుతూనే రాజకీయ విశ్లేషణల్లో ఆరితేరారు. న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ బీజేపీలో అంకితభావంతో పనిచేస్తున్నారు. 45 ఏళ్ల నుంచి ఆయన పార్టీకి విశేష సేవలందిస్తూ వస్తున్నారు. కేంద్రంలో పార్టీ అధికారంలో ఉన్నా ఆయనకు ప్రభుత్వ పదవులు రాలేదు. అయినప్పటికీ పార్టీపై విశ్వసనీయతతో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో క్రియాశీలంగా వ్యవహరిస్తూ వచ్చారు. గడచిన పార్లమెంట్ ఎన్నికల్లో నరసాపురం పార్లమెంట్ సీటును కూటమి తరపున కేటాయించేందుకు పాకా సత్యనారాయణ పేరు తెరపైకి వచ్చింది. అప్పట్లో భూపతిరాజు శ్రీనివాసవర్మ టిక్కెట్‌ను దక్కించుకున్నారు. ఇలా ఎన్నో సార్లు పాకా అవకాశాలను కోల్పోయారు. ఇప్పుడు కేంద్ర నాయకత్వం ఆశీస్సులతో రాష్ట్ర కోర్ కమిటీ రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేసింది. ఎన్నిక లాంఛనప్రాయం కానుంది. కూటమిలో బీజేపీ తరపున - మిగతా 8లో

అధికారితో.. ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి సమస్యలు, పైపులైన్ సమస్యలు, మంచినీటి ఎద్దడి, రక్షిత మంచినీటి పథకాల నుంచి స్వచ్ఛమైన నీరు అందుతుందా..., వాటి నిర్వహణ ఎలా ఉంది, మంచినీటి చెరువుల్లో కాల్వల నీరు నింపుతున్నారా.. తదితర అంశాలపై 30వ తేదీ బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించనుంది. ప్రజలు

91001 21200

నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపితే వాటి పరిష్కారానికి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జి.త్రినాథ్‌బాబు చర్యలు తీసుకుంటారు.

తాత్కాలికంగా ఫ్రీజర్ బాక్సుల ఏర్పాటు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పనిచేయని మార్చురీ ఫ్రీజర్ బాక్సులపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. తాత్కాలికంగా ఏలూరు ఫ్లాష్ సంస్థకు చెందిన మూడు ఫ్రీజర్ బాక్సులను ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ మేరకు అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసుపత్రిలో 12 మృత దేహాలను భద్రపరిచేందుకు ఫ్రీజర్ బాక్సులు ఉన్నాయని వాటిలో 8 బాక్సులు మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వారు కొత్త మెడికల్ కాలేజీ నిమిత్తం ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే అప్పటికే అవి పనిచేయడం లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరామన్నారు. మరో రెండు బాక్సులు పాడైపోయాయని అధికారులకు తెలిపామన్నారు. ఈనెల 24వ తేదీన మిగిలిన ఫ్రీజర్ బాక్సుల్లో ఆకస్మికంగా సమస్య ఏర్పడి అవి పాడైపోయాయని 25న ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. అప్పటి వరకు ఫ్లాష్ సంస్థ ద్వారా మూడు ఫ్రీజర్ బాక్సులను తీసుకువచ్చి ఏర్పాటు చేశామని మరో రెండు ఫ్రీజర్ బాక్సులు ఆసుపత్రిలో ఉన్నాయని మొత్తం ఐదు బాక్సులు అందుబాటులో ఉంచామని ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ మెడిసన్ హెచ్‌వోడీ డాక్టర్ కిలారి భాస్కర్ వెల్లడించారు.

ఎందుకీ జాప్యం ?

- డీసీసీబీ, డీసీఎంఎస్‌ల చైర్మన్ పదవులపై టీడీపీ, జనసేనలో తీవ్ర చర్చ
- డీసీఎంఎస్ చైర్మన్ తేలకపోవడమే కారణమా?
- జనసేన పక్షాన నేత ఎంపికలో జాప్యం
- డీసీసీబీ చైర్మన్‌గా గన్నికే అవకాశం ?!
- ఆ వెనువెంటనే ఆప్కాబ్ చైర్మన్ పదవికి..

■ లోపలి పేజీలో..

తప్పు దిద్దుబాటు!

- ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన యంత్రాంగం
- నీట మునిగిన వరిపొలాల నుంచి ముంపు నీటిని బయటకు మళ్లించే ప్రయత్నాలు
- ముంపునకు గురైన పొలాలను పరిశీలించిన రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది
- ఫారెస్టు అధికారులపై బాధిత వరి రైతుల ఫిర్యాదు
- నేడు కొల్లేరు తీరంలో సరిహద్దుల సర్వే



ఎక్స్‌కవేటర్ సాయంతో గండి కొట్టి పొలంలోని ముంపు నీటిని బయటకు మళ్లిస్తున్న దృశ్యం



నీటమునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, వ్యవసాయ అధికారులు

నిడమర్రు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఫారెస్టు అధి కారులు చేసిన తప్పును సరిచేసుకునే ప్రయత్నం చేస్తు న్నారు. నిడమర్రు మండలం పెదనింద్రకొలను - నిడమర్రు శివారు కొల్లేరు సరిహద్దు ప్రాంతంలో 16 ఎకరాల విస్తీర్ణంలోని రెండు చేపల చెరువులను కొల్లేరు సరస్సు భూమి ఉందంటూ శనివారం ఫారెస్టు అధికారులు గండ్లు కొట్టడంతో ఆ నీరంతా దిగువన ఉన్న వరిచేలను ముం చిన విషయం విదితమే. దీనిపై 'ఆంధ్రజ్యోతి' వచ్చిన కథనంతో అధికార యంత్రాంగంలో కదిలిక వచ్చింది. రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సోమవారం ఉదయం ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు. మరో వైపు ఫారెస్టు అధికారులు, ఫీల్డ్ సిబ్బంది ఇంజన్ల సాయంతో ఆదివారం రాత్రి నుంచే నీరు బయటకు తోడే ప్రయత్నాలు చేస్తున్నారు. సుమారు 15 మంది సిబ్బందితో కలసి రేంజ్ ఆఫీసర్ మోహినీ విజయ లక్ష్మీ, సెక్షన్ ఆఫీసర్ గంగారత్నం దగ్గరుండి పర్యవేక్షించారు. మరలా సోమవారం ఉదయం ఎక్స్‌కవేటర్‌ను తీసుకొచ్చి వరిచేలో నీరు బయటకు పోయేలా మార్గాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రానికి చేలో చాలా వరకు నీరు తగ్గుముఖం పట్టింది. కాగా రెవెన్యూ సిబ్బంది సోమవారం వ్యవసాయ శాఖాధికారులను వెంట తీసుకొని వెళ్లి వరిపంట నష్టం అంచనా వేయడానికి ప్రయత్నించారు. అయితే వరిచేలే ఇంకా నీరు ఉండడంతో కోత సాధ్యపడదనే నిర్ణయానికి వచ్చారు. నీరు పూర్తిగా తోడిన తర్వాత మరో వారానికి గాని నేల ఆరదని నిర్ణయానికి వచ్చారు. అప్పుడే కోతకోసి ఆ తర్వాతే రైతులకు ఎంతమేరకు నష్టం వాటిల్లుతుందో అంచనా వేయగలమని ఉన్నతాధికారులకు నివేదించినట్టు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

ఫారెస్టు అధికారులపై ఫిర్యాదు

ఇదిలా ఉండగా పంటకు వచ్చిన తమ వరిచేలను ఫారెస్టు అధికారులు నిర్లక్ష్యంతో నాశనం చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ నిడమర్రు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు చెందిన 7.50 ఎకరాల పంట మొత్తం విలువ సుమారు రూ.8.50 లక్షలను తమకు నష్టపరిహారంగా చెల్లించాలని బాధిత రైతులు చెన్నుబోయిన సుబ్బాయమ్మ, చెన్నుబోయిన వెంకన్న డిమాండ్ చేశారు. దీనిపై ఎస్ఐ వీరప్రసాద్ మాట్లాడుతూ రైతుల ఫిర్యాదును పరిశీలించి విచారణ చేస్తున్నామన్నారు.

నేడు కొల్లేరు అభయారణ్యంలో సరిహద్దు సర్వే

కొల్లేరు అభయారణ్యం పరిధిలోని సరస్సు సరిహద్దుతో పాటు భీమడోలు, నిడమర్రు మండలాల సరిహద్దులు అంచనా వేయడానికి సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రైతులు చేసుకున్న సర్వే దరఖాస్తు ఆధారంగా మంగళవారం సర్వే చేస్తామన్నారు. ఈ సర్వేలో భీమడోలు, నిడమర్రు మండలాల సరిహద్దులు కూడా అంచనా వేసి నిర్ధారిస్తామని తెలిపారు.



కైకలూరు మండలం పల్లెవాడలో పంటుపై నుంచి ఎక్స్‌కవేటర్‌తో పుల్లవా డ్రెయిన్ తవ్వకాలు

డ్రెయిన్లకు మహర్దశ

- కైకలూరు నియోజకవర్గంలో వేసవిలోనే ప్రక్షాళన పనులు
- వర్షాకాలం ముంపునకు చెక్ పెట్టేలా ముందస్తు చర్యలు
- ప్రభుత్వ నిధులు చాలక పోయినా నాయకుల చొరవతో ప్రక్షాళన పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆక్వా రైతులు

కైకలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ముంపు నివారణ లేకుండా ముందస్తుగా డ్రెయిన్ల ప్రక్షాళనతో సమస్య పరిష్కారానికి అడుగులు వేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో డ్రెయిన్ల మరమ్మతులు నిర్వహించకపోవడంతో గతేడాది వచ్చిన వరదల్లో అనేక గ్రామాలు, రోడ్లు, చేపల చెరువులు ముంపు బారిన పడ్డాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని టీడీపీ ప్రభుత్వం డ్రెయిన్ల ప్రక్షాళనకు నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం ఇచ్చిన నిధులు సరిపోక పోయినా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో ప్రత్యేక కమిటీ సభ్యులు ముందుకొచ్చి ఎక్కడికక్కడే డ్రెయిన్లను ప్రక్షాళన చేస్తున్నారు. కైకలూరు నియోజకవర్గంలోని 20 కిలోమీటర్ల పొడవున ఉన్న పుల్లవా డ్రెయిన్, 26 కిలోమీటర్ల పొడవున ఉన్న పెదకొమ్మిలేరు డ్రెయిన్ అభివృద్ధి పనులను చేపట్టారు. వీటి ప్రక్షాళన కోసం రూ.40 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే కామినేని సొంత నిధులతో పంటు కొనుగోలు చేయడంతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. కాలువ మధ్యలో పంటు పైన ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి డ్రెయిన్లలో పేరుకుపోయిన కిక్కిస, తూడును పూర్తిస్థాయిలో తొలగించారు. పుల్లవా డ్రెయిన్‌లో దిగువ ఉప్పుటేరు నుంచి ఎగువకు 12 కిలోమీటర్ల పొడవునా కిక్కిస తొలగించడంతో ఉప్పుటేరులో పోటుకు నీరు ఎగువకు పారుదల అవుతుంది. గతంలో ఎప్పుడూ ఇలా నీరు ఎదురు రావడం చూడలేదని ఆయా ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కైకలూరు మండలంలోని రామవరం, దొడ్డిపట్ల, భుజబలపట్నం, వదర్లపాడు గ్రామాల్లోని చేపల, రొయ్యల చెరువులకు ఈ డ్రెయిన్ ద్వారా వచ్చే నీటిని వినియోగించుకుంటున్నారు. ఈ డ్రెయిన్ అభివృద్ధితో ఎగువన ఆచవరం, కైకలూరు, కలిదిండి ఆర్అండ్‌బీ రహదారి ఆటపాక, అగ్రహారం వెళ్లే రహదారి ఆయా గ్రామాల్లో పలు నివాస గృహాలు ముంపు బారిన పడకుండా ఉంటాయి.

ముదినేపల్లి మండలంలో పెదకొమ్మిలేరు డ్రెయిన్‌లో కిక్కిస, తూడు దట్టంగా పేరుకుపోవడంతో గత వర్షాకాలం వేలాది ఎకరాలు పంటపొలాలు నీటమునిగి రైతులకు అపార నష్టం చోటుచేసుకుంది. దీంతో చిన్నకామనపూడి, పెదకామన పూడి, చిగురు కోట గ్రామాల్లో డ్రెయిన్ ప్రక్షాళన పనులు చేపడుతున్నారు. ఇప్పటికే సుమారు 60 శాతం పనులు పూర్తిచేశారు. అయితే పుల్లవా డ్రెయిన్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.29 లక్షలే నిధులు మంజూరు



చిగురుకోట వద్ద పెదకొమ్మిలేరు డ్రెయిన్‌లో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

చేయగా ఒక కిలోమీటరుకు ప్రభుత్వ ధరల ప్రకారం రూ.60 వేలు ఖర్చు అవుతుంది. కానీ క్షేత్రస్థాయిలో పనులు నిర్వహిస్తే కిలోమీటరుకు రూ.2.30 లక్షలు ఖర్చు అవుతోంది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు 12 కిలోమీటర్ల దూరానికే సరిపోయాయి. మిగిలిన 10 కిలోమీటర్లకి అయ్యే ఖర్చును ఎమ్మెల్యే కామినేని ఏర్పాటు చేసిన కమిటీ రైతులు భరించేందుకు ముందుకొచ్చారు. సాగునీటి సంఘాల అధ్యక్షులు, డీసీ చైర్మన్లు, రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో డ్రెయిన్ల ప్రక్షాళన పూర్తిస్థాయిలో జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. వేసవిలో ముందస్తుగా డ్రెయిన్‌ల ప్రక్షాళన చేయడం గతంలో ఈ ప్రాంతంలో ఎప్పుడూ చూడలేదంటూ రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం : కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో,అధికారులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, అధికారులు అందుకు అనుగుణంగా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వితో పాటు జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, డీపీవో అనురాధ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కర్, దేవకిదేవిలతో కలిసి మొత్తం 271 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోపుగా ఫిర్యాదులను పరిష్కరించని అధికారులపై చర్యలు తప్పవన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు పాలిసెట్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు బుధవారం నిర్వహించనున్న ఏపీ పాలిసెట్-2025 పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా కో-ఆర్డినేటర్, జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ఈనెల 30న పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏలూరులో 10 కేంద్రాలు, నూజివీడులో రెండుకేంద్రాల్లో జరుగుతుందని, అభ్యర్థులను ఉదయం 10గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. పరీక్ష ప్రారంభ సమయం తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమని, విద్యార్థులు ఉదయం 9 గంటలకే తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జవాబులను కేవలం పెన్సిల్‌తో మాత్రమే బబ్లింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో 3 ప్రభుత్వ, 5 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలుండగా, వీటిలో ఆయా కోర్సుల్లో సుమారు 4వేల సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.




ద్వారకాతిరుమల దేవస్థానం రుగ్వేద ఘనాపాఠి రత్నాకర్‌శర్మ దంపతులతో గణేష్‌శర్మ, మరో గురువు శ్రీనివాసశర్మతో..

గణేష్ శర్మ వేద విద్యాభ్యాసం ఇక్కడే..

కంచి కామకోటి పీఠ ఉత్తరాధికారిగా గణేష్‌శర్మ

రేపు కంచిలో బాధ్యతలు

ద్వారకాతిరుమలతో అనుబంధం

దేవస్థానం రుగ్వేద ఘనాపాఠి రత్నాకర్‌శర్మ వద్ద వేదాభ్యాసం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కంచికామకోటి పీఠ ఉత్తరాధికారిగా నియమితులైన రుగ్వేద పండితోత్తముడు దుడ్డు సత్యవెంకట సూర్యసుబ్రహ్మణ్య గణేష్ శర్మ ద్రవిడ్ ద్వారకా తిరుమలలో 2009 నుంచి దాదాపు 12 ఏళ్లపాటు రుగ్వేదం అభ్యసించారు. 2009లో వేసవి సెలవుల్లో తిరుపతిలో ఉన్న మేనమామ ఇంటికి వెళ్లిన గణేష్ శర్మను అదే సమయంలో తిరుపతి వచ్చిన కంచి కామకోటి పీఠం శంకరాచార్య స్వామీజీ దగ్గరకు పిలిచి ఆశీర్వదించారు. ఈ బాలుడిని ద్వారకా తిరుమల దేవస్థానం రుగ్వేద ఘనాపాఠి రత్నాకర్ శర్మ వద్ద చేర్పించాలని ఆదేశిం చారు. ఆయన వద్ద శిక్షణ తీసుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. దీంతో ఆయనను ద్వారకా తిరుమల రత్నాకర్ శర్మ వద్ద వేద విద్య కోసం చేర్పించారు. ద్వారకాతిరుమల దేవస్థానం రుగ్వేద సలక్షణ ఘనాపాఠి, కర్నాటక రాష్ట్రానికి చెందిన చందుకొట్లు హరాసమని రత్నాకర శర్మ ఇంటి వద్దే ఉంటూ విద్యనభ్యసించారు. ఆయన వద్ద రుగ్వేద సంహిత ఐతరేయ బ్రాహ్మణ అరణ్యకం, ఉపనిషత్తులు వంటి వాటిల్లో నిష్ణాతుల య్యారు. వేదాలకు అర్థాలను అధ్యయనం చేశారు. అనంతరం రత్నాకర్ శర్మ కుమారుడు ప్రస్తుత విజయవాడ కనకదుర్గ దేవస్థానం రుగ్వేద పండితుడు శ్రీనివాస శర్మ వద్ద కూడా కొన్నాళ్లు వేద విద్యను నేర్చుకున్నారు. ప్రతిశాఖ్య, వ్యాలిశిక్ష వంటి వేద పుస్తకాలను అభ్యసించడంతో పాటు మంత్రోచ్చరణ విధానాన్ని అభ్యసించారు. వీరిద్దరూ ఇచ్చిన శిక్షణ ఫలితంగా సంస్కృతం, వేద పుస్తకాలు, వేదాంత విద్య వంటి అంశాల్లో గణేష్‌శర్మ ఆరితేరారు. తరువాత బాసర దేవాలయంలో రుగ్వేద పండితుడుగా కొన్నాళ్లు సేవలందించారు.

కంచి కామకోటి పీఠ ప్రస్థానం ఇదీ

కంచి కామకోటి పీఠాన్ని జగద్గురు ఆదిశంకరాచార్య దాదాపు 25 శతాబ్దాల క్రితమే స్థాపించారు. మొదట్లో ఈ మఠం కుంభకోణంలో ఉండేది. ఆ తరువాత 18వ శతాబ్దంలో కాంచీపురానికి తర లించారు. ఎంతో సుదీర్ఘచరిత్ర కల ఈ మఠానికి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులున్నారు. కంచి పీఠాధిపతులు బిల్వదళ అర్చనలో నిష్ణాతులై ఉంటారు. 68వ పీఠాధిపతి అయిన చంద్రశేఖరేంద్ర సరస్వతికి భూమిపై నడిచే శంకరుడు అనే పేరుంది. 1907 నుంచి 1994 వరకు దాదాపు 87 ఏళ్లకాలం పాటు కంచి కామకోటి పీఠాధిపతిగా వ్యవహరించారు. తన 13వ ఏటనే సన్యాస దీక్షను చేపట్టారు. ధర్మప్రబోధాలు చేశారు. ఆయన తరువాత 1994 నుంచి 2018 వరకూ జయేంద్ర సరస్వతి పీఠాధిపతులుగా వ్యవహరించారు. ఎన్నో వివాదాల్లో చిక్కుకుని 2014లో కోర్టు తీర్పుతో ఊరట చెందారు. తరువాత 2018లో ఆయన శివైక్యం చెందారు. తర్వాత శంకర విజయేంద్ర సరస్వతి ప్రస్తుత పీఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు. తన వారసుడుగా 71వ పీఠాధిపతిగా అన్నవరానికి చెందిన గణేష్‌శర్మ ద్రవిడ్‌ను ఎంచుకున్నారు. గణేష్ శర్మ తండ్రి దుడ్డు ధన్వంతరి, తల్లి అలివేలుమంగాదేవి. తండ్రి ధన్వంతరి అన్నవరం దేవస్థానంలో వ్రత పురోహితునిగా చేస్తున్నారు. అక్షయ తృతీయ రోజైన ఈనెల 30న గణేష్‌శర్మ కంచికామకోటి పీఠానికి ఉత్తరాధికారిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.



ఉత్తమ ప్రదర్శన (అ) సత్యం నాటికకు బహుమతి అందిస్తున్న రాయప్రోలు భగవాన్, నిర్వాహకులు

ఉత్తమ ప్రదర్శనగా (అ) సత్యం నాటిక

ద్వితీయ బహుమతి 'జనరల్ బోగీలు'

ముగిసిన చైతన్యభారతి జాతీయస్థాయి నాటిక పోటీలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చైతన్యభారతి సంగీత నృత్య నాటక పరిషత్ 18వ జాతీయ స్థాయి నాటిక పోటీల్లో చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి (అ)సత్యం నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. నాలుగు రోజుల పాటు భీమవరం డీఎన్ఆర్ కళాశాల గన్నాబత్తుల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన నాటిక పోటీల ఫలితాలను నాటక పరిషత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. సాయి ఆర్ట్స్ కొలకలూరు 'జనరల్ బోగీలు' ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. యువబేరి థియేటర్ ఆర్గనైజేషన్ హైదరాబాదు వారి 'నా శత్రువు' నాటిక తృతీయ స్థానంలో నిలిచింది. జ్యూరీ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం, ఉత్తమ రచన నా శత్రువు, ఉత్తమ దర్శకత్వం బాలాజీ నాయక్ (అ)సత్యం, ఉత్తమ నటుడు చెన్నయ్య పాత్రధారి కావూరి సత్యనారాయణ (చిగురు మేఘం), ఉత్తమ నటి సావిత్రమ్మ పాత్రధారిణి సురభి ప్రభావతి (జనరల్‌బోగి), ఉత్తమ ప్రతి నాయకుడు సీఐ పాత్రధారి గోపరాజు విజయ్ (జనరల్ బోగీలు), ఉత్తమ హాస్యనటుడు పి. కోటేశ్వర రావు (మా ఇంట్లో మహాభారతం), ఉత్తమ బాలనటుడు యశ్విత(నా శత్రువు), ద్వితీయ ఉత్తమ నటుడు చెరుకూరి సాంబశివరావు (కిడ్నాప్), ద్వితీయ ఉత్తమనటి జ్యోతి రాణి (మా ఇంట్లో మహాభారతం), ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గంగోత్రి సాయి (విడాకాలు కావాలి), ఉత్తమ క్యారెక్టర్ నటి ఎం.రత్నకుమారి (బ్రహ్మ స్వరూపం), ఉత్తమ రంగాలంకారణ పీవీ కుమార్ (బ్రహ్మస్వరూపం), సంగీతం లీలామోహన్ (అ సత్యం), ఉత్తమ మేకప్ - థామస్ (ఉక్కు సంకెళ్ళు), జ్యూరీ బహుమతి చిగురు మేఘం, ఇది రహదారి కాదు నాటికలకు అందించారు. న్యాయ నిర్ణేతలుగా మానాపురం సత్యనారాయణ, రుద్రమూర్తి, కుసుము నాగభూషణం వ్యవహరించారు.చైతన్య భారతి అధ్య క్షుడు రాయప్రోలు భగవాన్, మంతెన రామ్ కుమార్, భట్టిప్రోలు శ్రీనివాసరావు, బోండా రాంబాబు, పెన్నాడ శ్రీనివాస్, కట్రెడ్డి సత్యనారాయణ, స్వామి పాల్గొన్నారు.



కొంతేరులో ఉత్తమ నాటిక 'స్వేచ్ఛ' కళాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న యూత్ క్లబ్ నాటక పరిషత్ కార్యవర్గ సభ్యులు

ఉత్తమ నాటికగా 'స్వేచ్ఛ'

యలమంచిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొంతేరు యూత్‌క్లబ్ నాటక పరిషత్ 43వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అఖిల భారతస్థాయి నాటికల పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి 'స్వేచ్ఛ', ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి 'జనరల్ బోగీలు', తృతీయ ఉత్తమ ప్రదర్శనగా శ్రీనటీనట సంక్షేమ సమాఖ్య పాలకొల్లు వారి 'అనూహ్యం' ఎంపికైనట్టు పరిషత్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చేగొండి సత్యనారాయణమూర్తి, పరిషత్ కార్యవర్గ సభ్యులు ఉత్తమ ప్రదర్శనలు, ఉత్తమ దర్శక, రచయిత, నటులకు జ్ఞాపిక, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా చేగొండి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నాటికలు సమాజ చైతన్యానికి ప్రతీకలు అన్నారు. పరిషత్ కార్యదర్శి గంటా ముత్యాలరావు, ఉపాధ్యక్షులు బోణం రవిబాబు, జక్కంశెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి అంబటి నవీన్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టితోనే మొక్కకు ఆరోగ్యం



మట్టి నమూనా పరీక్షలతో రైతులకు మేలు

రైతులు అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు వాడుతున్నారు. దీనివల్ల సాగు ఖర్చు గణనీయంగా పెరిగిపోవడం, నేల చౌడుబారిపోవడం, కొన్ని రకాల సూక్ష్మపోషక లోపాలు తలెత్తి దిగుబడి తగ్గిపోవడం వంటి నష్టాలు జరుగుతున్నాయి. భూమిలో పోషకాలు ఎంతమేర ఉన్నాయి ? ఏఏ ఎరువులు ఎంత మోతాదులో వేయాలి ? తెలుసుకునేందుకు రైతులు తమ పొలాల్లో మట్టి పరీక్ష చేయించుకోవాలి. ఫలితాల ఆధారంగా ఎరువులు వాడటం వల్ల ఈ దిగుబడి నష్టాలను కొంతవరకు తగ్గించుకునే అవకాశం ఉంటుందని మార్టేరు వరి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ కృష్ణాజీ సూచిస్తున్నారు.

ప్రతీ రెండేళ్లకు ఒకసారి చేస్తే మంచిది..

పోషకాల స్థాయి తెలుస్తుంది

ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం

దిగుబడి నష్టాలను తగ్గించుకునే అవకాశం

పెనుమంట్ర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మంచి పంట పండించాలంటే ముందుగా కావలసింది ఆరోగ్య వంతమైన భూమి. మొక్కలు పెరగడానికి వివిధ రకాల పోషకాలు అవసరమవుతాయి. ఈ పోషకాలను మొక్క గాలి, నీటి నుంచి తరువాత నేలలో కరిగిఉండే లవణాల రూపంలో తీసుకుంటుంది. పంటకు కావలసిన ఈ పోషకాలన్నీ కొంతమోతాదులో నేలలో సహజంగానే ఉంటాయి. రైతులు ప్రతీ రెండేళ్లకు ఒకసారి మట్టి పరీక్షలు చేయించుకుంటే మంచిది. మట్టి నమూనా అనేది మొత్తం పొలాన్ని యూనిట్‌గా తీసు కుంటారు. పొలం ఖాళీగా ఉండే సమయంలో ఎప్పుడైనా మట్టి నమూనా తీసుకోవచ్చు. సాధారణంగా ఒక పంట పండించే ప్రాంతాలలో ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల మధ్యలోనూ, రెండు పంటలు పండించే చోట్ల మే నెలలో నూ మట్టి నమూనాలు సేకరించుకోవాలి. పొలమంతా ఒకేరకంగా ఉంటే 5 ఎకరాల విస్తీర్ణానికి ఒక నమూనా చొప్పున తీసుకోవాలి. అదే పొలంలో నేల రంగు, మెరక పల్లం వంటి తేడాలు ఉంటే వేరు వేరుగా నమూనాలు తీసుకోవలసి ఉంటుంది.



నమూనా సేకరణ ఇలా..

మట్టి నమూనా తీయడానికి మొత్తం పొలంలో 10 నుంచి 12 చోట్ల మట్టి తీసుకోవాలి. ఈ మట్టి తీయడానికి ముందుగా నేల పైన ఉన్న చెత్త చెదారం తీసివేసి వి ఆకారంలో 6 అంగుళాల లోతులో గుంత తీసుకోవాలి. తరువాత పైనుంచి కిందకు ఒక పలుచని మట్టి పొర వచ్చే విధంగా పారతో మట్టిని తీసుకోవాలి. ఈ రకంగా 10, 12 చోట్ల నుంచి సేకరించిన మట్టిని ఒక ప్లాస్టిక్ కవర్లో గానీ, గోనెసంచిలో గానీ, ప్లాస్టిక్ బకెట్‌లో గానీ వేసుకోవాలి. తరువాత ఈ మట్టిని చతురస్రాకారంలో నేలమీద గానీ లేదా గోనె పట్టా పైన గాని పరుచుకోవాలి. మొత్తం మట్టిని 4 సమ భాగాలుగా వచ్చేలా అడ్డంగా నిలువుగా గీతలు గీయాలి. ఎదురెదురుగా ఉన్న భాగాలను తీసి వేయాలి. ఇలా చేసిన తరువాత మనకు రెండు భాగాలు మిగులుతాయి. ఈ రెండు భాగాలను కలిపేసి మళ్లీ నాలుగు సమ భాగాలుగా చేసుకోవాలి. ఈ సారి ఆపోజిట్ డైరెక్షన్‌లో ఉన్న రెండు భాగాలను తీసివేసి, మిగిలిన రెండు భాగాలను కలుపుకోవాలి. ఈ విధంగా మనకు ఒక అరకిలో మట్టి వచ్చేవరకు చేసుకుంటే మొత్తం పొలాన్నంతా ప్రతిబింబించే మట్టి నమూనా సేకరించే అవకాశం ఉంటుంది. మట్టి పరీక్షా ఫలితాలు కూడా సరిగా రావడానికి అవకాశం ఉంటుంది. ఈ రకంగా సేకరించుకున్న మట్టిని ఒక పాలిథిన్ సంచిలో వేసి, దాని పైన రైతు పేరు, గ్రామం, మండలం, సర్వే నంబరు, పొలం విస్తీర్ణం, గత మూడు కాలాలుగా పండించిన పంటల వివరాలు, తరువాత వేయబోయే పంటల వివరాలు, సాగు నీటి వివరాలు, నమూనా సేకరించిన తేదీ సమాచారం అంతా రాసి మట్టి పరీక్షా కేంద్రానికి పంపించాలి.

పోషకాల స్థాయిని బట్టి ఎరువులు

నేలలో ఉన్న నత్రజని, భాస్వరం, పొటాష్ మూలకాల పరిమాణం ఎంత ఉందనే విషయం తెలుసుకోవచ్చు. ఒక వేళ పోషకాలు తక్కువగా ఉంటే సిఫారసు చేసిన ఎరువుల పరిమాణంలో 25 శాతం పెంచి వేసుకోవాలి, ఎక్కువగా ఉంటే 25 శాతం తగ్గించి వేసుకోవాల్సి ఉంటుంది. ఇక సేంద్రియ కర్బనం పరిమాణాన్ని బట్టి ఎంత మోతాదులో సేంద్రియ ఎరువులు భూమికి వేసుకోవాలి అనే విషయాలు కూడా మట్టి పరీక్షల వల్ల తెలుసుకోవచ్చు. దీంతో పాటుగా జింక్, ఇనుము, మెగ్నీషియం, బోరాన్ వంటి సూక్ష్మ పోషక లోపాల గురించి కూడా తెలుసుకొని దానికి అనుగుణంగా నివారణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

మట్టి నమూనా సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు

చెట్ల కింద, గట్ల పక్కన, కంచెల దగ్గర, కాలి బాటలలోనూ, మట్టి నమూనా తీయకూడదు. పశువుల ఎరువు కుప్పల దగ్గర, పిట్ల కంపోస్ట్ పడే దగ్గర నమూనా తీయకూడదు. సారవంతంగా ఉన్న భూమిలోనూ, బాగా నిస్సారంగా ఉన్నచోట్ల కలిపి మట్టి నమూనా తీయకూడదు. చౌడు భూముల్లోనూ, మంచి భూమిలోనూ కలిపి నమూనా తీయకూడదు. గుంటలు తీసేటప్పుడు పైన ఉన్న చెత్త చెదారం తీసివేయాలే గానీ పైన ఉన్న మట్టి పొర తొలగించకూడదు. బురద నేలలో నమూనా తీయకూడదు. చౌడు ఎక్కువగా ఉన్న నేలల్లో పైనుంచి 15 సె.మీ వరకు ఒక నమూనా, 15 నుంచి 30 సె.మీ ఒక నమూనా తీసుకోవాలి.

గజ్జె కడితే.. పురస్కారమే..



కూచిపూడి, జానపద నృత్యాల్లో ప్రతిభ

చిన్ననాటి నుంచే వందలాది ప్రదర్శనలు.. అవార్డులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పంచమ వేదంగా శాస్త్రేతిహాసాల పరిగణించదగిన సమస్త శిల్ప సమాహారమైన నాట్యశాస్త్రాన్ని భరతముని మనకు అందించాడు. ఆరు లలిత కళలలో నాట్యం ఒకటైనా, నాట్యకళకు మిగిలిన కళలు లేకుండా పరిపూర్ణత రాదు. మిగిలిన కళలన్నీ నాట్యానికి హంగులు సమకూర్చేవే. నాట్యం పండిత పామర జనరంజకమైన కళ. ఆబాలగోపాలాన్ని అలరించే అద్భుతమైన ప్రక్రియ. ఏప్రిల్ 29 ..అంతర్జాతీయ నాట్య దినోత్సవం సందర్భంగా నాట్యకళలో రాణిస్తూ ప్రతిభ చూపుతున్న నాట్య కళాకారుల గురించి ప్రత్యేక కథనం.

చిన్నప్పటి నుంచే వారికి నృత్యమంటే ప్రాణం. చిన్న వయసులోనే గజ్జెకట్టి కూచిపూడి, జానపద నృత్యాల్లో అరంగ్రేటం చేశారు. వందలాది ప్రదర్శనలిచ్చి ఉత్తమ కళాకారిణిగా అవార్డులు, రివార్డులు అందుకున్నారు. చదువుతో పాటు కళారంగంలో రాణిస్తూ ఎన్నో బిరుదులు సాధించారు.

వట్టి కృష్ణ శ్రీమయి

ఏలూరుకు చెందిన శ్రీమయి పదోతరగతి చదువుతోంది. నాట్యంపై మక్కువతో చిన్ననాటి నుంచి నాట్యంలో శిక్షణ పొందుతోంది. కూచిపూడి నాట్యంలో తన ప్రత్యేకతను చాటుకుంటున్నది. అనేక అవార్డులు సాధించింది. ఇప్పటి వరకు 260 ప్రదర్శనలు ఇచ్చింది. నర్తన బాల అవార్డు, మణిబాల అవార్డు, జాతీయ డ్యాన్స్ నాట్య కళా పద్మ అవార్డు, గిన్నిస్ వరల్డ్ రికార్డు, నాట్య తిలక అవార్డు సాధించింది.

రిషిప్రియ →

కాళ్ళ శ్రవణ్ కుమార్, సునీత దంపతుల కుమార్తె రిషిప్రియ ఏలూరులో ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. చదువుతో పాటు నాట్యంలోనూ రాణిస్తున్నది. అభియన నృత్యభారతి సంస్థలో కూచిపూడి నాట్యంలో రెండేళ్లుగా శిక్షణ పొందుతూ ఇప్పటి వరకు వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చి ంది.నర్తనబాల అవార్డు, నృత్యంజలి నృత్యోత్సవంలో నంది అవార్డు, ఆంధ్ర సంఘం ఉగాది పురస్కారం అందుకుంది.

సింగంశెట్టి కావ్య సిద్ధిక.. →

కూచిపూడి నాట్యంలో కావ్య సిద్ధిక తన ప్రత్యేకతను చాటుకుంది. ఇప్పటి వరకు ఆమె 500 వరకు ప్రదర్శనలు ఇచ్చింది. ప్రేక్షకుల మన్నలను పొందుతోంది. ఏలూరులోని ఎన్నారై కళాశాలలో బీకాం కంప్యూటర్స్ విద్య అభ్యసిస్తున్నది. ఇప్పటి వరకు నాట్య తిలకం, బాల ప్రభ నిత్య దీపిక, నర్తన బాల, నృత్య కౌముది అవార్డులను సొంతం చేసుకుంది. చిన్ననాటి నుంచి నాట్యంపై మక్కువతో కూచిపూడి నాట్యం నేర్చుకుని తమ నాట్య విన్యాసాలతో ప్రేక్షకులను మైమరిపిస్తున్నది. నాట్య మయూరిగా మన్నలు పొందుతుంది.







అలంకరణలో రామలింగేశ్వర స్వామి.. అభిషేకాలు చేస్తున్న అర్చకస్వామి

నత్తా రామేశ్వరంలో ప్రారంభమైన దర్శనాలు

పెనుమంట్ర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలో 11 నెలలు నీటిలో ఉండి వైశాఖ మాసంలో నెలరోజులు మాత్రమే దర్శనం ఇచ్చే సప్తకోటి రామలింగేశ్వర స్వామి దర్శనం సోమవారంతో ప్రారంభమైంది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల శివనామస్మరణతో ఆలయం మార్మోగింది.వచ్చే నెల 27 వరకు స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.సోమవారం రామ లింగేశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. వేసవి కావడంతో చలవ పందిళ్లు ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో భక్తులకు ప్రసాదం వితరణ నిర్వహించారు. ప్రధాన అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వర శర్మ, అభిషేక పురోహితులు కాశీభట్ల సూర్యనారాయణ మూర్తి, భాస్కరశర్మ స్వామివారికి పూజలు నిర్వహించగా ఆలయ ఈవో యాళ్ల సూర్య నారాయణ భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్షీరా రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు



పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామికి సోమవారం సందర్భంగా ప్రత్యేకంగా ఏకవార, రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. గోపూజలు చేసుకున్నారు. సాయంత్రం పంచ హారతులు ఇచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. 26వ వార్డు శంభన్న అగ్రహారంలోని శంభేశ్వర స్వామి వారికి, కోడిగట్టున ఉన్న శంకర మఠంలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరుడికి అభిషేకాలు, పూజలు చేశారు.

డిప్యూటీ స్పీకర్ ఎలా ఉండాలో ఆర్ఆర్ఆర్ తెలుసుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విజయవాడ (గవర్నర్‌పేట), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్‌గా ఎలా ఉండాలో ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణ రాజు ముందు తెలుసుకోవాలని, అసెంబ్లీ స్పీకర్ ఎలా హుందాగా వ్యవహరిస్తున్నారో అలా ఉండేలా ఆర్ఆర్ఆర్‌కు మాట్లాడే విధానం నేర్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. పేదల ఇళ్లు నేనే కూలగొట్టిస్తా అని బహిరంగంగా మాట్లాడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూలగొట్టకూడదనే సుప్రీంకోర్టు తీర్పును రఘురామరాజు చూడాలని, కాలనీల్లో ఉండే వారు ఆయనకు ప్రజల్లా కని పించడం లేదా అని ప్రశ్నించారు. ఆయన చెప్పే అంశాలు ఏవీ కరెక్ట్ కాదన్నారు. ఎవరో ఏదో రిపోర్టు ఇచ్చారని నివాసాలు లేకుండా చేశారని, పేదల ఇళ్ళను మాత్రమే కూలగొట్టే అధికారులు ధనవంతుల అక్రమ నిర్మాణాలు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు వేసుకున్న వారికి పట్టాలు ఇస్తామని మంత్రి లోకేష్ అన్నారని, మంగళగిరిలో ఆయన అలాగే పేదలకు పట్టాలు ఇచ్చారని, రఘు రామరాజు ఆ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రఘు రామరాజుపై ఏనాడు తాము వ్యక్తిగత విమర్శలు చేయలేదని, క్షమాపణ చెప్పమనీ అడగలేదని, మాట జారింది ఆయనేనని, దాన్ని సరిదిద్దుకోవడం ఆయన విజ్ఞతకే వదిలి వేస్తున్నట్లు వెల్లడించారు. మురుగునీరు వస్తే వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, మురుగు పేరు చెప్పి ఇళ్లు పూర్తిగా కూలగొట్టడం న్యాయమేనా అని ప్రశ్నించారు.

మెగా డీఎస్సీ వల్ల ఏజెన్సీ యువతకు నష్టం

మెగా డీఎస్సీ పేరుతో ప్రభుత్వం ప్రకటించిన 16 వేల పోస్టుల్లో ఏజెన్సీ యువతకు నష్టం జరుగుతోందని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 4 వేల పోస్టులు ఖాళీగా ఉంటే ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం అక్కడ 90 పోస్టులు మాత్రమే చూపారని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను పునరుద్ధరిస్తామన్న చంద్రబాబునాయుడు మాట నిలబెట్టుకోలేదన్నారు. గిరిజనులకు ఇవ్వాల్సిన ప్రాంతాల్లో గిరిజనేతరులను నియమించారని అన్నారు. మే 2న గిరిజనులు చేసే బంద్‌కు సీపీఎం మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ లోగా చంద్రబాబు ఆర్డినెన్స్ తెచ్చి మాట నిలబెట్టుకోవాలని కోరారు.

1.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి 12,380 మంది రైతుల నుంచి 1,55,529 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జేసీ ధాత్రిరెడ్డి చెప్పారు. సోమవారం గోదావరి సమావేశ మందిరంలో రబీ ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. రైతుల నుంచి ఇంతవరకు రూ.359.27 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా రూ.206.71 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. మిగిలిన రూ. 150.30 కోట్లు జమ చేసే ప్రక్రియలో కొనసాగుతోందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా, ఫిర్యాదు చేసేందుకు జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08812-230448, 77020 03584, 75695 62076 నెంబర్లకు తెలపవచ్చన్నారు.జిల్లా పౌరసరఫరాల మేనేజర్ పీఎస్ఆర్ మూర్తి, డీఎస్‌వో ప్రతాప్‌రెడ్డి, ఎస్‌డీసీ దేవకీదేవి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ప్రత్యేక రైళ్లు



ఏలూరు క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని చర్లపల్లి - కాకినాడ , చర్లపల్లి - నర్సాపురం మధ్య మే 2వ తేదీ నుంచి జూన్ 29వ తేదీ వరకూ ప్రత్యేక రైళ్ళు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్ నంబర్ 07031 చర్లపల్లి నుంచి కాకినాడ టౌన్‌కు మే 2వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకూ, రైల్ నంబర్ 07032 కాకినాడ టౌన్ నుంచి చర్లపల్లికి మే 4వ తేదీ నుంచి జూన్ 29వ తేదీ వరకూ నడపనున్నారు. ఈ రైళ్ళు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్ళల్లో సెకండ్ క్లాస్ ఏసీ, త్రి టైర్ ఏసీ, స్లీపర్ క్లాస్ జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఉంటాయని తెలిపారు. రైల్ నంబర్ 07233 చర్లపల్లి నుంచి నర్సాపురానికి మే 2వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకూ, రైల్ నంబర్ 07234 నర్సాపురం నుంచి చర్లపల్లికి మే 4వ తేదీ నుంచి జూన్ 29వ తేదీ వరకూ నడపనున్నారు. ఈ రైళ్ళు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు, రైల్వే స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్ళల్లో ఈ రైళ్ళల్లో సెకండ్ క్లాస్ ఏసీ, త్రి టైర్ ఏసీ, స్లీపర్ క్లాస్ జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఉంటాయని తెలిపారు.

ఏపీ నిట్‌లో వర్క్‌షాప్

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఏపీ నిట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వచ్చే నెల 12 నుంచి 16వ తేదీ వరకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ కార్తికేయ శర్మ తెలిపారు. త్రీడీ మోడలింగ్ డిజైన్, ప్రింటింగ్, స్కానింగ్‌లో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు తెలుసుకోవచ్చునన్నారు. పరిమిత సంఖ్యలోనే విద్యార్థులను తీసుకుంటామని ఆసక్తి ఉన్న వారు వచ్చే 5వ తేదీ లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99854 57227, 90101 01065 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

(ఏలూరు- ఆంధ్రజ్యోతిప్రతినిధి)

ఎందుకీ జాప్యం ?

డీసీసీబీ, డీసీఎంఎస్‌ల చైర్మన్ పదవులపై
టీడీపీ, జనసేనలో తీవ్ర చర్చ
డీసీఎంఎస్ చైర్మన్ తేలకపోవడమే కారణమా?
జనసేన పక్షాన నేత ఎంపికలో జాప్యం
డీసీసీబీ చైర్మన్‌గా గన్నికే అవకాశం ?!
ఆ వెనువెంటనే ఆప్కాబ్ చైర్మన్ పదవికి..




గన్ని వీరాంజనేయులు, కొటికలపూడి చినబాబు

డీసీసీబీ, డీసీఎంఎస్‌ల చైర్మన్ పదవులు ఉమ్మడి పశ్చిమ మినహా మిగతా జిల్లాల్లో నామినేటెడ్ జాబితా విడుదలైంది. వాస్తవానికి ఏలూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులను ఆప్కాబ్ చైర్మన్‌గా నియమించే దిశగా ఇప్పటికే పార్టీ పరంగా స్పష్టమైన సంకేతాలున్నాయి. ఎందుకంటే ఉంగుటూరు నియోజకవర్గం నుంచి వరుసగా పోటీ చేస్తున్న గన్ని వీరాంజనేయులను కాదనుకుని ఈ స్థానాన్ని గత ఎన్నికల్లో జనసేనకు కేటాయించారు. కొంతకాలం క్రితం జిల్లా పర్యటనకు వచ్చిన యువనేత నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలు జిల్లాలో సంచలనం సృష్టించాయి. ఆయనకు స్వాగతం పలికేందుకు వెళ్లిన గన్ని వీరాంజనేయులను ఉద్దేశించి ఆప్కాబ్ చైర్మన్ రండి.. అంటూ లోకేష్ పలకరించడంతో అప్పటి నుంచి పార్టీ ఏ దిశగా నిర్ణయాలు తీసుకోబోతుందో తేటతెల్లం అయ్యింది. తాజాగా ఉమ్మడి పశ్చిమ డీసీసీబీ చైర్మన్ పదవిని జనసేనకు చెందిన ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోవిందరావు (చినబాబు) ఆశించారు. పార్టీలో కీలక నేతల మద్దతు కూడగట్టుకున్నారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆశీస్సులు కూడా ఆయనకు లభించినట్లు విస్తృత ప్రచారం సాగింది. జనసేన వర్గాలు కూడా చినబాబుకే డీసీసీబీ ఛాన్సు అంటూ విస్తృతంగా నినదించింది. కానీ ఇంకో వైపు టీడీపీ పరంగా మాజీ ఎమ్మెల్యే, ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులకు తొలుత ఉమ్మడి పశ్చిమ డీసీసీబీ చైర్మన్‌గా ఎంపిక చేసి, ఆ తదుపరి ఆప్కాబ్ చైర్మన్‌గా కొనసాగించే దిశగానే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగానే మిగతా జిల్లాలకు డీసీసీబీ, డీసీఎంఎస్‌ల చైర్మన్‌లను ఎంపిక చేసిన ఇక్కడ మాత్రం జాబితా వెలువరించలేదు. టీడీపీకి డీసీసీబీ చైర్మన్ పదవి, జనసేన డీసీఎంఎస్ పదవి కేటాయించాలని భావించి ఆ మేరకు కసరత్తు చేశారు. తొలుత డీసీసీబీ చైర్మన్‌గా భావించిన జనసేన జిల్లా అధ్యక్షుడు గోవిందరావుకు దానికి బదులుగా డీసీఎంఎస్ చైర్మన్ ప్రతిపాదించినా ఆయన దానికి సమ్మతించలేదని తెలుస్తోంది. ఈ కారణంగానే తాజాగా జాబితాలో పశ్చిమకు చోటు లేకుండా పోయింది. కొద్దిరోజుల వ్యవధిలోనే జనసేన తీసుకునే కీలక నిర్ణయం బట్టి నియమాకాలు జరగబోతున్నాయని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా డీసీఎంఎస్ చైర్మన్ పదవికి భీమవరానికి చెందిన కోళ్ల నాగేశ్వరరావు కూడా ఆశించారు. పార్టీలో సుదీర్ఘంగా కొనసాగడమే కాకుండా పార్టీలో కీలకంగా ఎదిగారు. భీమవరం నియోజకవర్గంలో పార్టీ పరంగా తొలి స్థానానికి పెరిగారు. అయితే జనసేన నుంచే డీసీఎంఎస్‌కు అవకాశం ఇస్తే నాగేశ్వరరావు లాంటి నేతలకు మరో ప్రాధాన్యత కలిగిన పదవి ఇస్తారని భావిస్తున్నారు.

నేడు, రేపు వేడిగాలుల తీవ్రత

అప్రమత్తత అవసరం : ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరుసిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతోంది. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. 40 నుంచి 43 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఈ వారంలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వారం రోజులుగా ఎండల తీవ్రత జిల్లాలో విపరీతంగా పెరిగింది. జిల్లాలో వేడిగాలులు ప్రభావం ఉంటుందని, రాబోయే రెండు రోజుల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో 42 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఇప్పటికే ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఉష్ణోగ్రతలు తారస్థాయికి పెరుగుతుండటంతో జనం విలవిల్లాడుతున్నారు. ఎండ వేడిమిని భరించలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సాయంత్రం సమయంలో వాతావరణంలో కొంత మార్పులు చోటు చేసుకుంటున్నా ఉదయం 10 గంటల నుంచే ఎండల తీవ్రత విపరీతంగా కనిపిస్తోంది. మధ్యాహ్నం 12 అయితే ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. రహదారులపై ప్రయాణించాలంటేనే ప్రజలు బెంబేలెత్తి లెత్తుతున్నారు.

రెండు రోజులు వేడిగాలులే..

జిల్లాలో వేడిగాలుల ప్రభావం కనిపిస్తోంది. ముఖ్యంగా కొన్ని మండలాల్లో రాబోయే రెండు రోజుల్లో ఎక్కువగా ఉండవచ్చునని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. జిల్లాలో ఈనెల 29 వతేదీన ఆగిరిపల్లిలో 40.9 సెంటీగ్రేడ్, చాట్రాయిలో 40.5, చింతలపూడిలో 40.4, దెందులూరులో 40, జంగారెడ్డిగూడెంలో 40.3, జీలుగుమిల్లిలో 40.5, కామవరపుకోటలో 40.2, కొయ్యలగూడెంలో 40, కుక్కునూరులో 42.1, లింగపాలెంలో 40.3, నూజివీడులో 40.6, ముసునూరులో 40.5, పెదవేగిలో 40.3, పెదపాడులో 40.3, టి నరసాపురంలో 40.4, వేలేరుపాడులో 41.5 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా వేశారు. అలాగే ఈనెల 30 వతేదీన జిల్లాలోని ఆగిరిపల్లిలో 41.2, చాట్రాయిలో 40.7, చింతలపూడిలో 40.4, దెందులూరులో 40.2, జంగారెడ్డిగూడెంలో 40.2, జీలుగుమిల్లిలో 40.2, కామవరపుకోటలో 40.2, కుక్కు నూరులో 42.1, లింగపాలెంలో 40.3, ముసునూరులో 40.6, నూజివీడులో 40.8, పెదవేగిలో 40.4, పెదపాడులో 40.6, టి.నరసాపురంలో 40.3, వేలేరుపాడులో 40.6 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది.

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజలందరూ వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఎంహెచ్‌వో ఆర్.మాలిని, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్ కుమార్‌లతో కలెక్టర్ సమీక్షించారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన పరచాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ వడదెబ్బకు గురికాకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజూ తగినన్ని నీళ్లు తాగడం, నేరుగా ఎండ వేడిమి తాకకుండా జాగ్రత్తలు పాటించడం ముఖ్యమని చెప్పారు. ముఖ్యమైన పనులు మినహా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్ళకూడదని, ఈ సమయంలో శారీరక శ్రమ అధిక మసాలా ఉన్న ఆహారం తినకుండా పోషకాలతో కూడిన తేలికపాటి ఆహారం తీసుకోవాలన్నారు. కూల్‌డ్రింక్స్ , అధిక చక్కెర ఉన్న పానీయాలు, కాఫీ, టీ వంటి పానీయాలను తగ్గించాలని సూచించారు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదని వీలైనంత త్వరగా దగ్గరలోని ఆస్పత్రికి తరలించాలన్నారు. చెమట పట్టక పోవడం, వణుకు పుట్టటం, మగత నిద్ర లేదా కల వరింతలు, శరీర ఉష్ణోగ్రత పెరగడం, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం వడదెబ్బ లక్షణాలన్నారు. ఆస్ప త్రుల్లో, గ్రామాల్లో ఆశావర్కర్ల వద్ద ఓఆర్‌ఎస్ అందు బాటులో ఉన్నందున, అవసరమైన వారు దీన్ని ఉపయోగిం చుకోవాలన్నారు. తీవ్రమైన వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే సంబంధిత వ్యక్తిని వెంటనే 108 అంబులెన్స్ సహాయంతో దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు.



తీపర్రులో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మహిళల జట్టు

తీపర్రులో జిల్లా స్థాయి బీచ్ కబడ్డీ పోటీలు

పెరవలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెరవలి మండలం తీపర్రు గోదావరి తీరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి బీచ్ కబడ్డీ ఎంపిక పోటీలు సోమవారం జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి అప్పలరాజు, యలమరెడ్డి శ్రీకాంత్, రంగారావు, తదితరులు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సింహాద్రి సత్యనారాయణ , మేకా రంగారావు, సంకు సూర్యనారాయణ, వాటాల వెంకటేశ్వరరావు, మల్లాడి రాంబాబు, తదితరులు సహకారం అందించారు. ఇందులో మొత్తం 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైనవారు వచ్చేనెల 2,3,4 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



వేంకటేశ్వరస్వామి విగ్రహం ఎదుట కుంభంపోసి నివేదన చేస్తున్న దృశ్యం

వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నదానం

భీమవరం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని వేంకటేశ్వర స్వామి 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు ముగింపులో భాగంగా సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో అర్చకులు శ్రీనివాసచార్యులు శ్రీవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి వారికి మహా నివేదన చేసి అన్న సమారాధన ప్రారంభించారు. మందిర కార్యదర్శి కుక్కల బాల, రామారావు, జానపాటి మధు, పెన్నాడ శ్రీను, కడలి వెంకటేశ్వరరావు, అల్లు రామారావు, రమేష్, చెరుకువాడ రంగసాయి, నళిని మోహన్ పాల్గొన్నారు.

ఖైదీలకు వైద్య సదుపాయం కల్పించండి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఖైదీలకు ఎటు వంటి అనారోగ్య సమస్యలు ఉన్నా తక్షణమే వైద్య సదుపాయం కల్పించాలని ఉభయ పశ్చిమ గోదావరి జిల్లాల న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ జైలు అధికారులను ఆదేశించారు. ఏలూరులో ఉన్న జిల్లా జైలును సోమవారం జడ్జి రత్న ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించి రుచి చూశారు. ఈ సందర్భంగా కారాగారంలోని ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలకు అందించే ఆహారం, మంచినీరు విషయంలో రాజీ పడవద్దని సూచించారు. ఖైదీలు అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్య సదుపాయం కలిపించాలని, ఎలాంటి నిర్లక్ష్యం, అలసత్వం వహించరాదని ఆదేశించారు. ఈ సందర్భంగా న్యాయ సహాయం కావాల్సిన ఖైదీలకు డీఎల్‌ఎస్‌ఏను సంప్రదించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖైదీల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పథకాలు పొందడంలో న్యాయసహాయం అవసరమైతే డీఎల్‌ఎస్‌ఏను సంప్రదించాలని తాము తక్షణం చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీ యత్నం.. యువకుడి అరెస్టు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎంను పగలుగొట్టడానికి ప్రయత్నించిన ఒక యువకుడిని ఏలూరు వన్‌టౌన్ ఎస్‌ఐ వి.నాగబాబు అరెస్టు చేశారు. ఏలూరు తూర్పువీధికి చెందిన లంకా తిరుమల వెంకట్ (21) సోమవారం తెల్లవారుజామున ఏలూరు గజ్జలవారి చెరువు వద్ద ఒక ఏటీఎంలోకి వెళ్ళి దానిని పగలుగొట్టడానికి ప్రయత్నించాడు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందడంతో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వి నాగబాబు కేసు నమోదు చేసి ఈ నేరానికి పాల్పడిన లంకా తిరుమల వెంకట్ సోమవారం మధ్యాహ్నం అరెస్టు చేశారు. ఏలూరు కోర్టుకు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో జిల్లా జైలుకు తరలించారు.

ఏలూరు కాల్వగట్టుపై ఆక్రమణల తొలగింపు

ఉంగుటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలంలో ఏలూరు కాల్వగట్టుపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు మోక్షం కలిగింది. ఏలూరు కాల్వ గట్లపై నిర్మించిన ఆక్రమణల్లో వ్యక్తిగత మరుగుదొడ్లతో పాటు వివిధ రకాల కాలుష్యం పెరిగి పోయింది. దీంతో రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ యంత్రాంగం సమష్టి కృషితో ఆక్రమణల తొలగింపు జరిగింది. దీనిపై ఎంపీడీవో రాజ్ మనోజ్ మాట్లాడుతూ సోమవారం నాడు మండలంలో 379 ఆక్రమణలకు గాను 170ని తొలగించామన్నారు.

రుణం ఇప్పిస్తానంటూ రూ.లక్షా 60 వేల మోసం

ఈలో... ఈలో యాప్‌లో యువకుడి పరిచయం
రుణం ఇప్పిస్తానని మోసం.. బాధితురాలి ఫిర్యాదుతో నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసి వివరాలు చెబుతున్న డీఎస్పీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో కనిపించిన ఒక యాప్‌పై ఒక యువతి ఆకర్షణకు లోనైంది. ఈలో...ఈలో యాప్‌లో కొత్త స్నేహితులతో పరిచయాలు పెంచుకుని నేరుగా మనసువిప్పి మాట్లాడుకోవచ్చునని, వీడియో కాల్స్ కూడా చేసుకోవచ్చునని, ఒంటరితనాన్ని పోగొట్టుకోవచ్చునని వచ్చిన ప్రకటనలతో ఒక యువకుడితో ఒక యువతి పరిచయం పెంచుకుని ఆర్థికంగా మోసపోయి సైబర్ నేరానికి గురైంది. బాధితురాలి ఫిర్యాదుతో నేరస్తుడిని భీమడోలు పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసువివరాలను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఏలూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం సాయంత్రం వెల్లడించారు. భీమడోలు మండలం ఆగడాలలంక గ్రామానికి చెందిన ఒక యువతి (26) ఈలో... ఈలో యాప్ ద్వారా కడప జిల్లా వేముల గ్రామానికి చెందిన నారుబోయిన రాజశేఖర్ అలియాస్ రాజు యాదవ్ (28) పరిచయం అయ్యాడు. రోజు వీడియో కాల్స్, వాట్సప్ కాల్స్ మాట్లాడుకున్నారు. తాము చేపల చెరువులు సాగు చేస్తామని లోను పెట్టుకుంటున్నామని చెప్పగా తానే లోను ఇప్పిస్తానంటూ ఏకంగా 8 లక్షల రూపాయలు ఆమె అకౌంట్‌కు వేసినట్లుగా మెస్సేజ్ పంపించాడు. ఆ తరువాత రాలేదని చెప్పడంతో టెక్నికల్ సమస్య ఉందంటూ దఫదఫాలుగా లక్షా 60 వేల రూపాయలను ఆమె వద్ద తీసుకున్నాడు. ఒక సెల్‌ఫోను కూడా ఆమె నుంచి తీసుకుని వెళ్ళిపోయాడు. ఆమె ప్రశ్నించగా ఆమెతో వీడియో కాల్స్ చేసిన ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా తయారు చేసి సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు.

దీంతో బాధితురాలు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ వై సుధాకర్ కేసు నమోదు చేయగా సీఐ యుజె విల్సన్ దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. 45 ఏళ్ళ ఒక మహిళతో సహజీవనం చేస్తున్నాడని మరో యువతిని కూడా ఈలో... ఈలో యాప్ ద్వారా పరి చయం పెంచుకుని మోసగించినట్లుగా గుర్తించామన్నారు. ఇలాంటి యాప్‌లు పట్ల యువతులు అప్ర మత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు.



భీమవరంలో కొవ్వొత్తులతో శాంతిర్యాలీ చేస్తున్న జర్నలిస్టులు

పహల్గాం దాడిని ఖండించాలి

భీమవరంలో జర్నలిస్టుల శాంతి ర్యాలీ

భీమవరం క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని భీమవరం పట్టణ జర్నలిస్టులు కోరారు. సోమవారం రాత్రి జర్నలిస్టులు అంతా కలిసి పట్టణంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రకాశం చౌక్ చేరుకుని కొందరు మాట్లాడారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలకు చెందిన టూరిస్టులు కశ్మీర్‌కు వెళ్ళగా వారిపై తుపాకులతో దాడి చేయడం హేయమైన చర్య అని ఖండించారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు రోజురోజుకీ మితిమీరి పోతున్నారని, వారిని కట్టడి చేయవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా శాశ్వతమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో వేగిరాజు రాధాకృష్ణంరాజు, సీతారామరాజు, ఆరేటి శ్రీను, బోణం శ్రీను, బ్రహ్మేంద్ర, జి.నాగరాజు, అయ్యప్ప, ధనరాజు (నాని), రాధాకృష్ణ, నరసింహమూర్తి, వెంకటేషు, బి.అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు

ఏలూరు రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ పోలీసులు రెండవ రోజు సోమవారం కూడా ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విజయవాడ గవర్నమెంట్ రైల్వే డీఎస్పీ జి.రత్నరాజు మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆకస్మికంగా ఈ తనిఖీలు చేపట్టామన్నారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఆర్‌పిఎఫ్‌కు చెందిన రాకీ అనే జాగిలంతో ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రయాణికుల లగేజీలతో పాటు రైల్వే స్టేషన్‌లోని పార్శిల్ ఆఫీసులు, ఇతర ప్రాంతాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలన చేశామన్నారు. రైళ్లలో ఎలాంటి నేరాలు జరగకుండా ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అక్రమ రవాణా జరుగకుండా ప్రభుత్వం నిషేధించిన గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం రవాణా కాకుండా చర్యలు చేపట్టామన్నారు. అంతేకాకుండా మండే పదార్థాలు, ద్రవాలు రవాణా చేయకుండా ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. డీఎస్పీతో పాటు రైల్వే సీఐ ఎంవి దుర్గారావు, ఏలూరు రైల్వే ఎస్‌ఐ సైమన్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

బిల్డింగ్ మీద నుంచి పడి వ్యక్తి మృతి

పాలకోడేరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మోగల్లు గ్రామంలోని అరుంధతీపేటకు చెందిన ఉండ్రాజవరపు నాగేశ్వరరావు (45) ఆదివారం రాత్రి రెండవ అంతస్తు మేడ ఎక్కుతుండగా మెట్ల పైనుంచి జారిపడి కింద ఉన్న ప్రహరీ గోడపై పడిపోయారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. నాగేశ్వరరావు భార్య కుటుంబ గొడవల నేపథ్యంలో దూరంగా ఉంటుంది. కుమారుడు జోసఫ్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాలకోడేరు హెడ్ కానిస్టేబుల్ హజరయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను వేధించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

పెదవేగి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలంలో ఒక గ్రామంలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసునమోదు చేశామని పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. మండలంలో ఒక గ్రామానికి చెందిన బాలిక పదో తరగతి పూర్తిచేసి, పై చదువులకు సంబంధించి ట్యూషన్‌కు వెళ్లి వస్తుండగా ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన కాటం వెంకటేష్ అనే వ్యక్తి దారికాచి, బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో ఆ వ్యక్తి అక్కడ నుంచి పారి పోయాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

పెదపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం అప్పనవీడు జాతీయ రహదారిపై తాళ్లమూడి చిన ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీడ్రైవర్ మృతి చెందగా, పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మండపేట నుంచి కేరళకు ఏపీ 31 టీఎఫ్ 2260 నెంబరు గల లారీ ఉప్పుడు బియ్యంతో వెళుతుండగా తాళ్లమూడి జాతీయరహదారి పక్కన నిలిపి వుంచిన కాంక్రీట్ మిల్లర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో విజయవాడ, కానూరుకు చెందిన వసంతరావు (47) తీవ్రగాయాలై మృతి చెందాడు. బంధువులు ఏసుకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కట్టా శారద సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు

భీమవరం క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బార్‌లో విధ్వంసం సృష్టించి బీరు సీసాతో దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదైంది. టూటౌన్ ఏఎస్‌ఐ నరసింహస్వామి తెలిపిన వివరాల ప్రకారం అంబేడ్కర్ సెంటర్‌లోని అజయ్ బార్‌లోకి ఈ నెల 27వ తేదీ రాత్రి పట్టణానికి చెందిన ప్రకాశ్ మరో ఐదుగురు స్నేహితులు కలిసి మద్యం సేవించడానికి వచ్చారు. అనంతరం బార్‌లో ఉన్న రెస్టారెంట్‌లో పని చేస్తున్న ప్రకాశ్ అనే యువకుడిపై ఈ ఆరుగురు గొడవపడ్డారు. ఆహారం విషయంలో తగాదా పడి అక్కడ ఉన్న బీరు సీసాలు బద్దలుగొట్టారు. అనంతరం ప్రకాశ్‌ను బీరు సీసాతో పొడవబోగా గాయాలతో తప్పించుకున్నాడు. దీనిపై బార్ గుమస్తా దారపురెడ్డి గణేష్ (బాబి) ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామన్నారు.

డిమాండ్ల సాధన కోసం ఎన్ఎంయూ రిలే దీక్షలు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) :ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ న్యాయమైన 38 డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సోమవారం ఆర్టీసీ డిపో వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం డిపో ఎన్ఎంయూ అధ్యక్షుడు ఎస్.ఎస్. కుమార్ మాట్లాడుతూ గ్యారేజీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ రిలే నిరాహార దీక్షల్లో వి.సి.హెచ్. రావు, కుమార్, ఎస్ఎస్.నారాయణ, వైఎం.వెంకటేశ్ పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అధిక ఉష్ణోగ్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. మండలంలోని గుణ్ణంపల్లిలో ప్రజలకు వడదెబ్బ పట్ల అవగాహన కల్పిస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఎక్కువనీరు తాగాలని, నీడపట్టున ఉండేలా చూసుకోవాలని అన్నారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లలితకుమారి, మేక శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

వైసీపీకి ఆరో డివిజన్ కార్పొరేటర్ రాజీనామా

ఏలూరు రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : ఏలూరులో వైసీపీకి మరోషాక్ తగిలింది. ఆరో డివిజన్ కార్పొరేటర్ సుంకర చంద్రశేఖర్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావుకు పంపించారు. ఇప్పటికే ఏలూరు మాజీ మంత్రి ఆళ్ల నాని, మరి కొంతమంది ముఖ్యనేతలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం తీసుకున్నారు. అయితే చంద్రశేఖర్ ఏ పార్టీలో చేరేది ఇంకా ప్రకటించలేదు.

చిత్రలేఖనం పోటీల్లో రఫీ ప్రతిభ

దెందులూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : గోపన్నపాలెం హైస్కూల్లో డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ముక్కల రాంబాబుతో పాటు రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రఫీని సోమవారం ఘనంగా సన్మానించారు. గోపన్నపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం మరీదు మనోహర్, తెలుగు ఉపాధ్యాయుడు మాసగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ సన్మానం నిర్వహించారు. ఈ నెల 27న ఆంధ్రా యునివర్సిటీ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించగా ములక్కాయలపాడు గ్రామానికి చెందిన రఫీ మొదటి బహుమతి అందుకున్నట్టు తెలిపారు. ఆంధ్ర యునివర్సిటీ వైస్ చాన్సలర్ రాజశేఖర్ చేతుల మీదుగా రఫీ బహుమతి అందుకున్నారు.

కలెక్టర్‌కు అర్జీదారుల కృతజ్ఞతలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ సమస్యల పరిష్కారం కావడంపై అశోక్ నగర్‌కు చెందిన శేఖర్ నగర్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, కరస్పాండెంట్ అంబికా సుబ్బారావు సోమవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వికి లేఖను అందజేశారు. శేఖర్ నగర్‌లో శ్రీవీరమాచనేని కల్యాణ మండపం రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు, ప్రమాదాల నియంత్రణకు, యువత మోటార్ సైకిళ్లతో సవారీలు, స్టంట్లు నివారించడానికి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో అర్జీని అందజేశామని సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు అడిగిన వెంటనే మూడ్రోజుల్లో ట్రాఫిక్ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేసినందుకు కలెక్టర్, నగరపాలక సంస్థ, డీఎస్పీలకు తమ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

డీవైఈవోగా రవీంద్ర భారతి బాధ్యతల స్వీకారం



ఏలూరు అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : ఏలూరు డివిజన్ విద్యా శాఖాధికారిగా ఎస్.రవీంద్ర భారతి నియమితులయ్యారు. ప్రస్తుతం ఉంగుటూరు మండల విద్యాధికారిగా పనిచేస్తున్న ఈమెను ఏలూరు డీవైఈవో (ఎఫ్ఏసీ)గా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేయగా, ఆమె ఏలూరులో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు డీవైఈవోగా ఉన్న రవిప్రకాశ్ ఏలూరు, కలిదిండి మండలాలకు ఎంఈవోగా కొనసాగుతారు. రవీంద్రభారతి మాట్లాడుతూ డివిజన్‌పరిధిలోని 13 మండలాల్లో పదోతరగతి పరీక్షల్లో ఫెయిలైన బాలబాలికలకు నిర్ణీత టైంటేబుల్ ప్రకారమే రోజూ ప్రత్యేక తరగతులు అన్ని హైస్కూళ్లలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా డీవైఈవో బాధ్యతలు చేపట్టిన రవీంద్ర భారతికి ఏపీటీఎఫ్-1938, తదితర ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు జి.కృష్ణ, సురేశ్ కుమార్, మోహన్, రామ్మోహనరావు, దుర్గాప్రసాద్, శ్రీనివాసరావు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మన్యం బంద్‌ను జయప్రదం చేయండి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ మే 2న జరిగే మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం పడమట రేగులకుంటలో జరిగిన సంఘ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ వలన గిరిజనులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 1034 పోస్టులు కేటాయించగా కెఆర్ పురం ఐటీడీఏకు కేవలం 32 పోస్టులే కేటాయించారని అన్నారు. గిరిజనులకు న్యాయం చేసేలా ప్రత్యేక డీఎస్సీని విడుదల చేయాలంటూ బంద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. సమావేశంలో నాయకులు పోలోజు నాగేశ్వరరావు, వెట్టి వీరయ్య, నూక భద్రం, టి.ప్రసాద్, కె.లక్ష్మణరావు, దుర్గారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల దుర్గంధంపై చర్యలు తీసుకోండి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కోళ్ల వ్యర్థాలను డ్రెయినేజీల్లో వేయకుండా చర్యలు తీసుకోవాలని సోమవారం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో దళితులు ఎంపీడీవో కె.జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు అతి సమీపంలో ఉన్న చికెన్ షాపుల నిర్వాహకులు వ్యర్థాలను డ్రెయినేజీల్లో వేస్తున్నారని, వివిధ పనుల వల్ల ఈ కార్యాలయాలకు వస్తున్న ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గిరిజనులకు కేటాయించిన షాపుల్లో బినామీల పేరుతో గిరిజనేతరులు దుకాణాలు నడుపుతున్నారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీవో మాట్లాడుతూ ఈ విషయంపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ కో-ఆప్షన్ మెంబర్ దారా శిఖామణి, ఏసుపాదం పాల్గొన్నారు.

ఎర్రకాలువ జలాశయం నుంచి మంచినీరు సరఫరా

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : ఏఐబి పథకం ద్వారా ఎర్రకాలువ జలాశయం నుంచి పట్టణానికి మంచినీరు అందించే పథకానికి ఏడు సంవత్సరాల వరకు మున్సిపాలిటీ నుంచి మెయింటినెన్స్ ఫీజు నిమిత్తం రూ.15.78 కోట్లు చెల్లించనున్నట్టు మున్సిపల్ ఛైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి తెలిపారు.సోమవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఛైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ముందుగా కశ్మీర్ ఉగ్రదాడులకు నిరసనగా కౌన్సిల్ సభ్యులు, అధికారులు కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సభ్యుల ఆమోదం కొరకు కౌన్సిల్ ముందుంచారు. సమావేశంలో కమిషనర్ కెవి.రమణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు కంచర్ల వాసవీరత్నం, ముప్పిడి అంజి, కౌన్సిలర్లు నంబూరి రామచంద్ర రాజు, కరుటూరి రమాదేవి,తెలగారపు జ్యోతి, వలవల తాతాజీ, ఎ.వి.రమణమూర్తి, పీపీఎస్.చంద్రరావు పాల్గొన్నారు.

ఆశ్రంలో రోగులకు లంచ్ బాక్సుల పంపిణీ

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) :లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆశ్రం వైద్య కళాశాలలో మెడికల్ విద్యార్థుల సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఆసుపత్రిలోని రెండు వార్డుల్లో రోగుల సహాయకులకు లంచ్ బాక్సులు అందజేశారు. లయన్స్ జిల్లా నాయకులు ఎం.శ్రీహరి, ఎల్.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. క్లబ్ శాఖను వైద్య కళాశాల యాజమాన్యం సహకారంతో ఏర్పాటు చేసినందున ఇక మీదట రోగులకు అవసరమైన సేవలను మరింత విస్తృత పరుస్తామన్నారు. మెడికల్ కాలేజ్ లయన్స్ స్టూడెంట్స్ క్లబ్ సభ్యులు లక్ష్మి, అమృత, అంజలి, హరిణి, వేద్రశ్రీ, పార్వతి, లాస్యశ్రీ, సంహిత, లిఖిత్, థెహర్, తన్వి, లీసా, భువన, కావ్య వర్షిణి, శివాని, రామరాజు పాల్గొన్నారు.

5న జరిగే సింహగర్జనను జయప్రదం చేయండి

లింగపాలెం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : ఏలూరులో మే 5వ తేదీన జరిగే దళితసేన సింహగర్జన ధర్నాను విజయవంతం చేయాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవి ప్రకాశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన లింగపాలెంలో దళితనేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల సాగు భూములకు పట్టాలివ్వాలని, డప్పు కళాకారులు, చర్మకారులు, వృద్ధులకు సంక్షేమ పించన్లు 6వేలు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులతో కలిసి గోడపత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్, ప్రధాన కార్యదర్శి పి.ఇదియా, లక్ష్మాము దాసు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చేబ్రోలులోని ఐస్ ఫ్యాక్టరీ ప్రారంభం

ఉంగుటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి మత్స్య సంపద పథకంలో భాగంగా సోమవారం చేబ్రోలులోని ఐస్ ఫ్యాక్టరీని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. తొలుత కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా యూనిట్ విలువ రూ.1.20 కోట్లు కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ.72 లక్షలివ్వగా లబ్ధిదారుని వాటా రూ.48 లక్షలు అని వివరించారు. కార్యక్రమంలో ఐస్ ఫ్యాక్టరీ ప్రతినిధులు ములగాల వరలక్ష్మి, మహ్మద్ అఫ్సర్‌లతో పాటు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శరణాల మాలతీరాణి పాల్గొన్నారు.

మోదీ సభను జయప్రదం చేయండి



దుగ్గిరాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీకగా అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతోందని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు దృఢ సంకల్పంతోనే సాధ్యపడుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రభాకర్ అధ్యక్షతన సోమవారం దెందులూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ, కూటమి నేతల భేటీని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అమరావతిని నాశనం చేయడానికి గత వైసీపీ ప్రభుత్వం ఎన్నో కుట్రలు చేసిందని, కూటమి అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలోనే అన్ని అడ్డంకులను అధిగమించి, ప్రజా రాజధాని నిర్మాణాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. మే 2వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని నిర్మాణ పునఃనిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 70 బస్సులతో పాటు కార్లలో వేలాదిగా నియోజకవర్గం నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు వెళ్తున్నట్టు ప్రభాకర్ తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకులు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రానికి అమరావతి వంటి గొప్ప రాజధాని నిర్మించాలని చంద్రబాబు సంకల్పించుకున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాజధానిని నాశనం చేశారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చవటపల్లి విక్రమ్ కిశోర్, టీడీపీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణ ప్రసాద్, నంబూరి నాగరాజు, గారపాటి రామసీత, మోరు శ్రావణి, లావేటి శ్రీనివాస్, కొనకళ్ల శివమణి, మోతుకూరి నాని, గుత్తా అనిల్, నేతల రవి, మంచినేని శ్రీనివాస్, మాగంటి ప్రభాకర్, కమ్మ శివరామకృష్ణ, బొడ్డేటి మోహన్, జనసేన నాయకుడు పవన్, కల్కి రమేష్, గరికిపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● కామవరపుకోట : ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంఎల్ఏ ఘంటా మురళీ రామకృష్ణ, టీడీపీ మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణలు సోమవారం పిలుపునిచ్చారు. మండలం నుంచి 16 బస్సులను ఏర్పాటు చేశామని, అన్ని గ్రామాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు విచ్చేయాలన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వస్తారన్నారు.

● చింతలపూడి : అమరావతిలో మే 2వ తేదీన జరిగే ప్రధాని మోదీ సభను జయప్రదం చేయాలని పరి



బుట్టాయగూడెంలో మాట్లాడుతున్న బొరగం

శీలకులు అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు కోరారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సమక్షంలో నియోజకవర్గ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జె.ముత్తారెడ్డి, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : ప్రధాని మోదీ ఏపీ రాజధాని అమరావతి పనుల ప్రారంభోత్సవానికి వస్తున్నందున పోలవరం నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ట్రైకార్ ఛైర్మన్, పోలవరం నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు కోరారు. సోమవారం బూసరాజుపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

● ఉంగుటూరు: ప్రధాని మోదీ అమరావతి సభను జయప్రదం చేయాలని ఏ.పి.స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మెన్ బత్తుల తాతయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో టి.డి.పి. జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, శరణాల మాలతీరాణి, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎం.ఎల్.సి. అంగర రామ్మోహన్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : బాలల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. జూన్ 6వ తేదీ వరకు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కె.రమేశ్ బాబు తెలిపారు. విద్యార్థులకు డ్రాయింగ్, కథల చెప్పించడం, చదివించడం వంటి తరగతులు జరుగుతాయన్నారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శోభ వివరించారు. కమిటీ సభ్యులు నరసింహారావు, పద్మనాభరావు, కొండలరావు, చాముండేశ్వరరావు, గంగా భవాని, తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి :వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగించుకోవాలని విశ్రాంత పశువైద్యాధికారి కంచెన మోహనరావు అన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని మోహనరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉద్యోగి వేమూరి బాలాజీ, గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

● పెదపాడు : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని పెదపాడు మండల విద్యాశాఖాధికారి దేవినేని వెంకటరమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని పెదపాడు గ్రంథాలయంలో సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు దుగ్గిపోగు జాన్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

●ఏలూరు టూటౌన్ : విద్యార్థులు తరచూ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీ డి.ప్రసాద్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులకు హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలే మొదటి నేస్తాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు, అసిస్టెంట్ బీటీ సందీప్‌కుమార్, రిసోర్స్‌పర్సన్ శ్రీవల్లి, డ్రాయింగ్ టీచర్ పీ.శంకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. మహిళా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా ఉపాధ్యాయురాలు వై.అరుణ నీతి కథలు వినిపించారు. రిసోర్స్ పర్సన్ ఎం.జగదీశ్వరి విద్యార్థులచేత కథలు చదివించారు. మాస్టర్ ఫణి కాంత్ డ్యాన్స్ నేర్పించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వై.సుశీల, రిటైర్డ్ లైబ్రేరియన్ వేలంగిణి, గ్రంథపాలకురాలు యాగంటి శ్రీదేవి, పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ఏలూరు రూరల్,ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సమ్మెకు దిగారు. సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సిద్ధయ్య, కార్యదర్శి కురెళ్ల సురేంద్ర మాట్లాడుతూ కొద్దిరోజులుగా సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేపట్టామన్నారు. మార్చిలో కమిషనర్‌కు వినతి పత్రం అందించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగభద్రత కల్పించి ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు మేనేజర్‌కు ఘన సత్కారం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల యూనియన్ బ్యాంకులో మూడేళ్ల పాటు సేవలందించిన మేనేజర్ కందుల నాగేషును పలువురు ఘనంగా సన్మానించారు. రాజహేంద్రవరానికి బదిలీ అయిన సందర్భంగా ఆయన ఖాతాదారులకు అందించిన సేవలను గుర్తిస్తూ సోమవారం ఘనంగా సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ మైనార్టీ మండలాధ్యక్షుడు మద్దాల వెంకటేశ్వర రావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సిర్రా భరత్, ఎంపీటీసీ అల్లాడ హరేరామకృష్ణ, మాజీ ఎంపీటీసీ రాయపాటి సోమేశ్వరరావు, టీడీపీ గ్రామ కమిటీ ప్రెసిడెంట్ ఎం.రత్నాజీ పాల్గొన్నారు.



బ్యాంకు మేనేజర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



మెడికల్ కిట్‌లు అందజేస్తున్న చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. అంజుమన్ పంక్షన్ హాల్లో పాదయాత్రకు వెళ్లే హాజీలకు శిక్షణ నిర్వహించారు. అనంతరం హాజీలకు మెడికల్ కిట్‌లు, బ్యాగులు, మెడికల్ వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యునైటెడ్ ఉమ్మడి జిల్లా హజ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు షేక్ నజీరుద్దీన్, అంజుమన్ అధ్యక్షులు జబీఉల్లా, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ చిరస్మరణీయురాలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : ఆకలితో వచ్చిన వారికి లేదనకుండా నిత్యాన్నదానం చేసిన అపర అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ చిరస్మరణీయురాలని ఆర్టీసీ విజయవాడ ఛైర్మన్ రెడ్డి అప్పల నాయుడు పేర్కొన్నారు. డొక్కా సీతమ్మ వర్ధంతిని పురస్కరించుకుని జనసేన పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు. నిత్య సేవకులు, అయ్యప్ప స్వామి భక్తులు, జగపతి మనోహరం స్వామి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు, మెగా అభిమానులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అప్పలనాయుడు

ఆక్వా రైతుల అభివృద్ధికి కృషి

పెదపాడు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆక్వా సాగు చేపట్టిన రైతుల అభివృద్ధికి దోహదపడేలా నూతన సాంకేతికతో కూడిన ఆక్వా ఫీడ్‌ను వారికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్టు దీపక్ నెక్స్‌జెన్ సంస్థ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. పెదపాడు మండలం గుడిపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ ఆక్వా ఫీడ్ అండ్ నీడ్ షాపును నెక్స్‌జెన్ అధినేత సుబ్రహ్మణ్యం సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుడిపాడు, వడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లోని ఆక్వా రైతులకు నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులను అందుబాటులో ఉంచేలా షాపును ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సైదు సోమేశ్వరరావు, సంస్థ టెక్నికల్ హెడ్ డాక్టరు ఎం.వి.డి. మల్లేశ్వరరావు, సీహెచ్ శేషాద్రిరావు, కురెళ్ల రాజేంద్రప్రభు, నెక్కంటి కల్కేశ్వరరావు, జయమంగళ నాగేంద్ర శ్రీనివాసరావు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.



షాపును ప్రారంభిస్తున్న సుబ్రహ్మణ్యం

విధేయత, విశ్వసనీయతకు పెద్దపీట

(ఐదో పేజీ తరువాయి)

రాజ్యసభ అభ్యర్థిగా పాకా సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ప్రస్తుతం ఆయన బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

పాకా రాజకీయ ప్రస్థానం..

1980-82 బీజేపీ భీమవరం పట్టణ ప్రధాన కార్యదర్శి
1982-84 పట్టణ అధ్యక్షుడు
1984-86 జిల్లా కార్యదర్శి
1986-91 జిల్లా ఉపాధ్యక్షుడు
1991-93 భీమవరం నియోజకవర్గ కన్వీనర్
194-96 రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు
1996-98 పట్టణ అధ్యక్షుడు
1998-2000 రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు
2000-04 పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్
2004-06 రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు
2006-10 జిల్లా అధ్యక్షుడు
2012-18 రాష్ట్ర అధికార ప్రతినిధి
2014: ఎన్నికల మ్యానిఫెస్టో డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యుడు
2018-21 రాష్ట్ర ఉపాధ్యక్షుడు
2021 నుంచి రాష్ట్ర క్రమశిక్షణా సంఘం ఛైర్మన్
2024 బీజేపీ రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ఎన్‌సీసీ క్యాంప్‌లో నాణేల ప్రదర్శన

పెదవేగి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : దుగ్గిరాలలోని డీ పాల్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపులో వివిధ రకాల నాణేలు, నోట్లను ప్రదర్శించారు. ఏలూరుకు చెందిన ప్రముఖ నాణేల సేకరణ కర్త అలీఖాన్ మహమ్మద్ ఏర్పాటు చేసిన ఈ నాణేల ప్రదర్శనను క్యాంపు ఆర్మీ కల్నల్ అమిత్ పాండే, క్యాంపు సూపరింటెండెంట్ మామిళ్ల కొండయ్య, ఉమర్‌ఖాన్, మానవతా నాగేశ్వరరావు, గుడిపాటి నరసింహారావు, శ్రీహరి కోటి, ఆర్మీ సుబేదార్ వినోద్‌కుమార్ తిలకించారు.

ఎన్ఎంయూ రిలే నిరాహార దీక్షలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలంటూ నేషనల్ మజ్దూర్ యూనియన్ రిలే నిరాహార దీక్షలను చేపట్టింది. ఏలూరు ఆర్టీసీ డిపో ఎదురుగా రిలే నిరాహార దీక్షలను ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బీవీ రావు, జిల్లా కార్యదర్శి వి.ఎస్.రావు, డిపో కార్యదర్శి ప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ, సెలవులు వెంటనే మంజూరు చేయాలన్నారు.



రన్నర్ ట్రోఫీతో ఏలూరు జిల్లా క్రీడాకారులు

షూటింగ్ బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో తొలిసారి ఏలూరు జిల్లా పాల్గొని రన్నర్ ట్రోఫీ కైవసం చేసుకోవడం పట్ల జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్.హరికృష్ణ, కార్యదర్శి వడ్డాది గణేశ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో గణేశ్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణంలో ఈ నెల 26, 27 తేదీల్లో వశిష్ఠ, సీబీఎస్‌సీ స్కూల్లో జరిగిన పోటీల్లో ఏలూరు జిల్లా టీం పాల్గొందన్నారు. ఈ మేరకు విజేతలను ఆ పాఠశాల హెచ్ఎం ప్రకాశ్ ఫిజికల్ డైరెక్టర్ పి.పద్మలత, ఉపాధ్యాయులు అభినందించారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చడానికి సహకరించిన పీడీ పద్మలతను అసోసియేషన్ నాయకులు అభినందించారు.



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

బ్యాటరీ వాహనం అందజేత

ఏలూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతుడైన జంగారెడ్డిగూడేనికి చెందిన వీరవల్లి శంకరరావుకు రూ.65 వేలు విలువ చేసే మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఉచితంగా పంపిణీ చేశారు. బ్యాటరీ వాహనాన్ని తనకు మంజూరు చేయాలని పీజీఆర్ఎస్ కార్యక్రమంలో శంకరరావు గతంలో దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో స్పందించిన కలెక్టర్ అతనికి వాహనం మంజూరు చేసి పంపిణీ చేశారు. మూడు చక్రాల వాహనం ద్వారా చిరు వ్యాపారం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని వెట్రి సెల్వి సూచించారు. కార్యక్రమంలో జిల్లా విభిన్నప్రతిభావంతుల, వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్స్ వినియోగంలో జాగ్రత్తలు పాటించండి

సైబర్ సెల్ మహిళా ఎస్ఐ పద్మ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆండ్రాయిడ్ మొబైల్స్ వాడకం దారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏలూరు సైబర్ సెల్ మహిళా ఎస్ఐ ఎస్.వి.పద్మ అన్నారు. ఏలూరు సమీపంలోని దుగ్గిరాల డిపాల్ కాలేజీ ప్రాంగణంలో ఎన్‌సీసీ విద్యార్థులకు సైబర్ నేరాలపై సోమవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ మోసాలు ఎలా జరుగుతాయో వివరించి చెప్పారు. ఎస్ఐ పద్మ మాట్లాడుతూ ప్రైవసీ సెట్టింగులను జాగ్రత్తగా ఉపయోగించడం వల్ల సైబర్ నేరాలకు గురికాకుండా కాపాడుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా వాట్సప్ టెలిగ్రామ్‌లలో ఇన్వెస్ట్ చేయమని వచ్చే ప్రకటనలను నమ్మి మోసపోవద్దన్నారు. సైబర్ నేరానికి ఎవరైనా గురైతే 1930కు సమాచారం అందించి సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డిపాల్ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవస్థానం పాఠశాల క్రీడా మైదానంలో అపచారం..

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేవస్థానం శానిటేషన్ ట్రాక్టర్ డ్రైవర్, సిబ్బంది దేవస్థానం పాఠశాల క్రీడా స్థలంలో మద్యం తాగడం వివాదాస్పదమైంది. దేవస్థానం పాఠశాల ఆవరణలో పట్టపగలే బహిరంగంగా మద్యం తాగడంతో దేవాలయ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటర్వ్యూ..

క్లోరినేషన్ చేసిన నీటినే ప్రజలకు అందిస్తున్నాం

కె.నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, తడికలపూడి



● స్వచ్ఛాంధ్రలో భాగంగా చేపట్టిన చర్యలేమిటి?

జవాబు : స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర పథకాన్ని తడికలపూడిలో పటిష్టంగా అమలు చేస్తున్నాం. రోడ్లపై, డ్రెయినేజీల్లో చెత్త లేకుండా శుభ్రం చేయిస్తున్నాం. ప్రధానంగా పనికిరాని ఎలక్ట్రానిక్స్ వస్తువులను రీ సైక్లింగ్ కోసం పంచాయతీ పరంగా స్వీకరిస్తున్నాం.

● తాగునీటి సమస్య తలెత్తకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు : ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని వార్డులకు ఉదయం, సాయంత్రం వేళల్లో క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేస్తున్నాం.

● పన్నుల వసూళ్లకు చేపట్టిన చర్యలేమిటి?

జవాబు : ఇంటి పన్నుల ద్వారా రూ. 28 లక్షలు రావాల్సి ఉండగా గత నెలాఖరుకు దాదాపు రూ. 15 లక్షలు వసూలు చేశాం. మిగిలిన బకాయిలను నిర్దేశించిన సమయానికి వసూలు చేస్తాం.

- కామవరపుకోట

సారా స్థావరాలపై దాడులు

లింగపాలెం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సారా స్థావరాలపై దాడి చేసి ఒకరిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం మండలంలో సింగగూడెంలో సారా స్థావరంపై దాడి చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్నమరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిఐ పి.భోగేశ్వరరావు పాల్గొన్నారు.

అటవీ శాఖ ఫలసాయం చెల్లించాలి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వన సంరక్షణ సమితుల్లో పని చేస్తున్న పేదలకు అటవీ శాఖ నుంచి రావాల్సిన బకాయిలు విడుదల చేయాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం ఆధ్వర్యంలో అటవీ ప్రాంత పేదలు, వి.వి.ఎస్ సభ్యులు ఏలూరు రేంజ్ అధికారి కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఏలూరు జిల్లా మెట్ట ప్రాంతాల్లో ఉన్న అటవీ భూముల్లో జామాయిల్, వెదురు మొక్కలు వేసి వనసంరక్షణ సమితుల్లో పని చేస్తున్న పేదలకు ఫలసాయం ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. కార్యక్రమంలో వీవీఎస్‌ల నాయకులు నాగేశ్వరరావు, మోహన్‌రావు, లక్ష్మి, జయరాజు పాల్గొన్నారు.

కొనసాగిన ఎన్‌సీసీ శిబిరం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : వార్షిక క్యాంపులో భాగంగా స్థానిక సెయింట్ డీపాల్ కళాశాలలో జిల్లాలోని ఎన్‌సీసీ కెడెట్లకు నిర్వహిస్తున్న శిక్షణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఫీల్డ్‌క్రాఫ్ట్, బెటర్ క్రాఫ్ట్, మ్యాప్ రీడింగ్‌లపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కమాండింగ్ ఆఫీసర్ అమిత్ పాండే, ఏఎన్‌వోలు, పీఐ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి

ముగిసిన శిక్షణ తరగతులు

కుక్కునూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మేడే వేడుకలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రవి పిలుపునిచ్చారు. దాచారంలో జరిగిన సీఐటీయూ డివిజన్ స్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులంతా పాల్గొని మేడే వేడుకలను ఘనంగా జరుపుకోవాలన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా 20వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి వై. సాయి కిరణ్, జిల్లా కార్యదర్శి నాగమణి, సీపీఎం మండల కార్యదర్శి బియ్యన శ్రీను, టీ.సురేశ్, ఎం.రమాదేవి, షేక్ వలిబాష పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

ముదినేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పేరూరు గ్రామంలో స్థానిక సమస్యలపై ఇరువర్గాల మధ్య జరిగిన తగాదాలో దళితులను కులం పేరుతో దూషించారని ఆ గ్రామానికి చెందిన మురళీ, అతని తల్లిపై మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు శావ నాగ జగన్ బాబూరావు, గరికిముక్కుల రాజేష్, భూపతి సునీత సోమవారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ గ్రామంలోని సమస్యకు స్థానిక దళితులకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొంటూ, గ్రామస్థులు, పెద్దల సమక్షంలో దళితులను కులం పేరుతో దూషించి కించపరిచారని ఫిర్యాదు చేశారు.

ప్రధాని సభకు 10 బస్సుల ఏర్పాటు

చాట్రాయి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మే 2న జరిగే ప్రధాని మోదీ సభకు చాట్రాయి మండలం నుంచి 10 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. చాట్రాయి నుంచి 2 బస్సులు, మర్లపాలెం, చిన్నంపేట, ఆరుగొలనుపేట, చనుబండ, చీపురుగూడెం, పోలవరం, తుమ్మగూడెం, కొత్తగూడెం గ్రామాలకు ఒక్కో బస్సు ఏర్పాటు చేసి ప్రతి బస్సుకు ఒక ఇన్‌చార్జిని నియమించినట్లు ఎంపీడీవో చెప్పారు.

విధేయత, విశ్వసనీయతకు పెద్దపీట

(ఐదో పేజీ తరువాయి)

రాజ్యసభ అభ్యర్థిగా పాకా సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ప్రస్తుతం ఆయన బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

పాకా రాజకీయ ప్రస్థానం

1980-82 బీజేపీ భీమవరం పట్టణ ప్రధాన కార్యదర్శి, 1982-84 పట్టణ అధ్యక్షుడు, 1984-86 జిల్లా కార్యదర్శి, 1986-91 జిల్లా ఉపాధ్యక్షుడు, 1991-93 భీమవరం నియోజకవర్గ కన్వీనర్, 194-96 రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, 1996-98 పట్టణ అధ్యక్షుడు, 1998-2000 రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, 2000-04 పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్, 2004-06 రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, 2006-10 జిల్లా అధ్యక్షుడు, 2012-18 రాష్ట్ర అధికార ప్రతినిధి, 2014: ఎన్నికల మ్యానిఫెస్టో డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యుడు, 2018-21 రాష్ట్ర ఉపాధ్యక్షుడు, 2021 నుంచి రాష్ట్ర క్రమశిక్షణా సంఘం ఛైర్మన్, 2024 బీజేపీ రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు.

పట్టాలు ఇవ్వాలని సాగుదారుల ధర్నా

చాట్రాయి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చెయ్యాలని కోరుతూ సోమవారం చాట్రాయి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సాగుదారులు ధర్నా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు మాట్లాడుతూ చిత్తపూరు గ్రామంలో ఆర్ఎస్ నెంబరు 1-4 లో 125 ఎకరాల భూమిని 75 ఏళ్ళ నుంచి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు చెందిన 40 పేద కుటుంబాల వారు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని, పట్టాలు ఇవ్వాలని ఎన్ని విజ్ఞప్తులు చేసినా అధికారులు పాలకులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రెవెన్యూ ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే జరిపి సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని లేని పక్షంలో రెవెన్యూ, ఫారెస్ట్ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లిబరేషన్ నాయకులు కలపాల వెంకటేశ్వరరావు, చాట్ల బాబూరావు, తిరువీది ఏసు, రాంబాబు, రమేష్, రాజా పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురికి జరిమానా

నూజివీడు టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు మండలానికి చెందిన ఇద్దరు నిందితులను నూజివీడు తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. సోమవారం నాడు మస్తానయ్య మాట్లాడుతూ బైండోవర్ అయ్యి మరలా ఎక్సైజ్ నేరానికి పాల్పడిన పోతురెడ్డిపల్లి గ్రామానికి చెందిన రెడ్డి కౌసల్య భర్త ఇస్సాకు రూ.10,000, జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన చల్లారి రవీంద్రబాబు తండ్రి వెంకటేశ్వరరావుకు రూ.10,000 జరిమానాను తహసీల్దార్ వారు విధించారన్నారు.

చాట్రాయి: చాట్రాయి తహసీల్దార్ ఎదుట గతంలో బైండోవర్ అయిన పోతనపల్లి చిన్నతండాకు చెందిన హసావత్తు బాలరాజు మరలా ఎక్సైజ్ నేరానికి పాల్పడి బైండోవర్ ఉల్లంఘించినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. నిందితుడు బాలరాజును సోమవారం తహసీల్దార్ గీత ఎదుట హాజరు పర్చగా రూ.10 వేలు జరిమానా విధించినట్లు, అలాగే సి గుడిపాడుకు చెందిన కటారి జయరాజును తహసీల్దార్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ చెప్పారు.

నేడు అధికారులతో మంత్రి సారథి సమీక్ష

చాట్రాయి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎమ్మెల్యే, గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం ఉదయం 9 గంటలకు చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష జరుపుతారని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీ నరసింహారావు మృతి


లక్ష్మీనరసింహారావు (ఫైల్‌ఫొటో)

ముసునూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రేనిపాడుకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ పీఏసీయస్ అధ్యక్షులు సూర్యదేవర లక్ష్మీనరసింహారావు (84) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈయన టీడీపీ బలోపేతానికి విశేష కృషి చేయడంతోపాటు, 13 ఏళ్ళపాటు పీఏ సీయస్ అధ్యక్షుడిగా పనిచేశారు. భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం లక్ష్మీనరసింహారావు పార్థివదేహాన్ని టీడీపీ నాయకులు బొమ్మగంటి శ్యామలరావు, రాపర్ల బాలకృష్ణ, గద్దల మోహన్‌రావు, రాపర్ల ప్రతాప్, మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు సందర్శించి, ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పబ్లిక్ టాయిలెట్‌లు నిర్మించాలని వినతి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ, పోలీస్ డివిజన్ కేంద్రంగా నిత్యం రద్దీగా ఉండే నూజివీడు పట్టణంలో బహిరంగ మల, మూత్ర విసర్జనశాలలు (పబ్లిక్ టాయిలెట్‌లు) లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నూజివీడు పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి అన్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతో సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీగా ఉన్న నూజివీడు పట్టణంలో 75 వేలకు పైగా జనాభా కలిగి ఉన్నారని, ప్రతి నిత్యం పెద్ద ఎత్తున ప్రజలు రాకపోకలు కొనసాగిస్తారని తెలిపారు. ఒక్క బస్టాండ్ సెంటర్ మినహా పట్టణంలో మరెక్కడా బహిరంగ మరుగు దొడ్లు లేకపోవడం వలన ప్రజలు ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

చెరువులకు కోళ్ల వ్యర్థాలు

కైకలూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం చటాకాయ్ గ్రామంలో పది ఎకరాల ఫంగస్ జాతి చేపల చెరువుల్లో ఆదివారం అర్ధరాత్రి కోళ్ల వ్యర్థాలు దిగుమతి చేశారు. గ్రామానికి చెందిన సుబ్బరాజు అనే రైతు వీటిని హైదరాబాద్ నుంచి అక్రమంగా తీసుకువచ్చి ఫంగస్‌జాతి చేపల చెరువులో మేతగా వేస్తున్నాడు. ఆ సమయంలో కొంతమంది సమీపాన ఉన్న రైతులు గుర్తించి అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిపై వాగ్వివాదానికి దిగి వారిని భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చేసరికే లారీలోని కోళ్ళవ్యర్థాలను చెరువులో వేశారు. దీనితో ఖాళీ లారీని కైకలూరు రూరల్ ఎస్సై వి.రాంబాబు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్‌పై లక్ష రూపాయల పూచీకత్తుపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గతంలోనూ అదే ప్రాంతంలో కోళ్ళవ్యర్థాలను ఫంగస్‌జాతి చేపలకు వేయటం గుర్తించి కేసులు నమోదు చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కోళ్లవ్యర్థాల వ్యాన్

అధ్వానంగా భోగేశ్వరస్వామి ఆలయ బీటీ రోడ్డు



కలిదిండి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో సుమారు రూ.7 కోట్లతో నిర్మించిన పాతాళ భోగేశ్వరస్వామి - సంతోషపురం బీటీ రోడ్డు పెద్ద గోతులు పడి అధ్వానంగా ఉంది. పలు చోట్ల రోడ్డు కుంగిపోయి పగుళ్లు ఏర్పడటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. నిత్యం ఈ రహదారిపై సంతోషపురం, కొత్తూరు, భాస్కరరావుపేట, మూల్లంక, పెదలంక శాంతినగరం, సత్యనారాయణ నగర్, పోలు పేట నరసింహాపురం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి సోమవారం పాతాళ భోగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు వెళ్లి వస్తుంటారు. సుమారు 3 కిలోమీటర్ల మేర రోడ్డు గోతులు పడ్డాయి. ఈ రోడ్డు నిర్మాణం కోసం ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. వైసీపీ హయాంలో బీటీ గ్రావెల్ రోడ్డుపై తారు వేయకుండా వదిలేయటంతో గోతులు పడి కుంగిపోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు బిల్లులు మంజూరు కాకపోవటంతో బీటీ గ్రావెల్ రోడ్డుపై తారు రోడ్డు పనులను కాంట్రాక్టర్ నిలుపుదల చేశారు. దీంతో బీటీ గ్రావెల్ రోడ్డు నిర్మాణ దశలోనే గుంతలు పడి పాడైపోతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బీటీ గ్రావెల్ రోడ్డుపై తారు రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.




ముదినేపల్లి గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు. గోపవరం గ్రంథాలయంలో మాట్లాడుతున్న సర్పంచ్ వాణి.. ఆగిరిపల్లిలో శిక్షణ

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

ముదినేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరాలు ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిబిరాలు జూన్ 6 వరకు నిర్వహిస్తారు. తొలి రోజు గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదివించటం కార్యక్రమాలను గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి నిర్వహించారు. వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేయకుండా పుస్తక పఠనం, ఆటల్లో పాల్గొనటం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆమె కోరారు. గురజ శాఖా గ్రంథాలయంలో కూడ గ్రంథాలయాధికారిణి జాన్సీ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభయ్యాయి.

ముసునూరు: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కంచర్ల వాణి కోరారు. సోమవారం గోపవరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని కార్యదర్శి సుకుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం వేసవిలో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ముసునూరు శాఖ గ్రంథాలయంలో శిక్షణ శిబిరాన్ని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాల అధికారులు సునీల్‌కుమార్, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించామని లైబ్రేరియన్ డి.నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు ఉదయం 8 గంటలకు శిక్షణ తరగతులకు హాజరు అయ్యారని తెలిపారు. ఈ రోజు జీకే క్లాసులు, కథలు చెప్పడం, చదివించటం చేశామని తెలిపారు.

విద్యార్థులకు కొత్త చిక్కులు

- బేసిక్ ప్రైమరీ స్కూళ్లుగా యూపీ పాఠశాలలు
- ముదినేపల్లి మండలంలో 9 యూపీ పాఠశాలల రద్దు
- కిలోమీటర్లు దూరంలో హైస్కూళ్లకు వెళ్ళేదారి లేదు

ముదినేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో అమలులోకి రానున్న ఐదు బడుల వ్యవస్థలో అప్పర్ ప్రైమరీ పాఠశాలలు బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మారనుండడంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ఇప్పటి వరకు తమ గ్రామాల్లోనే ప్రాథమిక విద్య అనంతరం 6,7,8తరగతులు చదువుకున్న విద్యార్థులు ఇప్పుడు మారనున్న వ్యవస్థలో హైస్కూలు చదువులకు దూర ప్రాంతాలకు వెళ్ళాల్సి రావడం ఎన్నో వ్యయ ప్రయాసలకు దారితీసే అవకాశాలు ఉన్నాయి. ముదినేపల్లి మండలంలో 11 యూపీ పాఠశాలలు ఉండగా వాటిలో సింగరాయపాలెం, వైవాక యూపీ పాఠశాలలు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. కోడూరు, దాకరం, దేవపూడి, చినకామనపూడి, చేవూరు, కొర్రగుంటపాలెం, వాడవల్లి, తగరవాడ, వణుదుర్రు యూపీ పాఠశాలలు బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మారనున్నాయి. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు మాత్రమే ఉంటాయి. దీంతో మండలంలోని కోడూరు యూపీ పాఠశాల విద్యార్థులు 8 కిలోమీటర్ల దూరంలోని పెదపాలపర్రు హైస్కూలుకు, దాకరం యూపీ విద్యార్థులు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ముదినేపల్లి హైస్కూలుకు, చినకామనపూడి యూపీ విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిగురుకోట కాని, నాలుగు కిలోమీటర్ల దూరంలోని వడాలి హైస్కూలుకు గాని, కొర్రగుంటపాలెం యూపీ స్కూలు విద్యార్థులు మూడు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలోని అల్లూరు, బొమ్మినంపాడు హైస్కూళ్లకు చేవూరు, కాకరవాడ యూపీ విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంపైగా ఉన్న సింగరాయపాలెం హైస్కూలుకు, వణుదుర్రు, దేవపూడి, వాడవల్లి యూపీ పాఠశాలల విద్యార్థులు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మల్లపురాజుగూడెం, పెదగొన్నూరు హైస్కూళ్లకు 6,7,8 తరగతుకు వెళ్ళాల్సిన ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. రద్దయిన యూపీ స్కూళ్ల విద్యార్థులు దూరంలో ఉన్న హైస్కూళ్లకు వెళ్ళేందుకు కనీసం సరైన రహదారి సౌకర్యం కాని రవాణా సౌకర్యం కాని లేకపోవడంతో ఆయా హైస్కూళ్లకు ఎలా వెళ్ళాలన్నది ప్రశ్నార్థకంగా మారింది.

యూపీ పాఠశాలలు ఉంచాలి



జాస్తి రాజా, సర్పంచ్ దాకరం

గ్రామీణ ప్రాంతాల్లో యూపీ పాఠశాలలు కొనసాగించాలి. కొత్త వ్యవస్థ విద్యార్థులకు సౌకర్యం పెంచాలే కాని ఇబ్బందులు కలిగించకూడదు. యూపీ స్కూళ్లులేకుంటే 6,7,8 తరగతులకు దూరంలో ఉన్న హైస్కూళ్లకు వెళ్ళడం విద్యార్థులకు ఇబ్బంది. ప్రభుత్వం పునరాలోచించాలి.

హైస్కూళ్లకు వెళ్ళడం కష్టం



యర్రంశెట్టి హైమావతి, ఎస్ఎంసీ ఛైర్మన్, వాడవల్లి, యూపీ స్కూలు

వాడవల్లి యూపీ పాఠశాలలో 6,7,8 తరగతులను తొలగించడం విద్యార్థులకు ఇబ్బందికరం. తమ గ్రామం నుంచి 25 మందికి పైగా విద్యార్థులు చాలా దూరంలో ఉన్న హైస్కూళ్ళకు వెళ్ళడం కష్టమైన ప్రక్రియ. వాడవల్లిలో యూపీ స్కూళ్లు కొనసాగించాలి. లేకుంటే విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్ళే అవకాశం ఉంటుంది.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉత్సవాలు

లూర్దుమాత ఉత్సవాల్లో భద్రతపై ఎస్ఐ సమీక్ష

మండవల్లి,ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం భైరవపట్నంలో మే 1,2,3 తేదీల్లో నిర్వహించే లూర్దు మాత ఉత్సవాలు సీసీ కెమెరాలు పర్యవేక్షణలో జరిపించేలా ఏర్పాటు చేయాలని ఎస్సై రామచంద్రరావు తెలిపారు. స్థానిక చర్చి వద్ద సోమవారం ఉత్సవాలకు సంబంధించి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు. మద్యం తాగి ఎటువంటి అవాంఛనీయ సంఘటన గొడవలు సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మన ఊరు ఉత్సవాలు ఎంతో ఘనంగా జరుపుకోవాలని అందులో వివాదాలకు అస్కారం ఉండకూడదని తెలిపారు. కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ శాంతరాజు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ప్రభుత్వ విధానాలతో రిటైర్డ్ ఉద్యోగులకు నష్టం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం నూజివీడు యూనిట్ ప్రత్యేక సమావేశం సోమవారం నాడు నూజివీడులోని సంఘ కార్యాలయంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గోవిందరావు మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానల వలన భవిష్యత్‌లో విశ్రాంతి ఉద్యోగులకు పెన్షన్ పెరుగుదల ఉండదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పే రివిజన్ జరిగిన ప్రతిసారి ఉద్యోగులతోపాటు విశ్రాంతి ఉద్యోగులకు పేరివిజన్ చేసి బేసిక్ పెన్షన్ పెంచుతాయని కానీ కేంద్రం పెన్షన్ సవరణ బిల్లు ప్రవేశ పెట్టి గత మార్చి 29న గెజిట్ పబ్లికేషన్ చేసి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పోస్టు కార్డు ఉద్యమం చేపట్టి తమ వినతిని తెలియజేస్తామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

అమరావతి పునఃనిర్మాణ సభను విజయవంతం చేయండి

కైకలూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2వ తేదీన అమరావతి పునఃనిర్మాణానికై ప్రధాని నరేంద్రమోదీ వస్తున్నందున ఆ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరు ట్రావెలర్స్‌బంగ్లాలో కూటమి పార్టీలకు చెందిన ముఖ్య నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు ఆంధ్రరాష్ట్ర ప్రజలు రాజధానిపేరు చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దేశంలో ఎక్కడికి వెళ్లినా ఆంధ్రప్రదేశ్ రాజధాని అంటే అమరావతి అని గర్వంగా చెప్పుకోగలుతున్నామన్నారు. అలాంటి రాజధాని అమరావతి పునఃనిర్మాణానికై దేశప్రధాని రావడం ఎంతో శుభసూచకమన్నారు. కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి నేపధ్యంలో యుద్ధ వాతావరణం నెలకొంటున్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాని నరేంద్రమోదీని ఆహ్వానించిన వెంటనే వస్తానని ఆయన హామి ఇవ్వడం శుభపరిణామమన్నారు. స్థానిక నాయకులంతా కలిసికట్టుగా అమరావతి పునఃనిర్మాణ సభను విజయవంతం చేసేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు మెంటే పార్థసారథి, కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కోకన్వీనర్లు కొడాలి వినోద్, బొమ్మనబోయిన విజయలక్ష్మీ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణురావు, కూటమి నేతలు పెన్మెత్స త్రినాథరాజు, నారగాని కొండా, చల్లగుళ్ళ శోభనాద్రిచౌదరి, పోకల జోగిరాజు పాల్గొన్నారు.

స్పందనకు 9 దరఖాస్తులు

నూజివీడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్ స్వయంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సీపీఐ నాయకుడు నరసింహం, మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు కొన్ని గ్రామాల్లో ఇంకా ప్రారంభం కాలేదని వాటిని వెంటనే ప్రారం భించాలని కోరారు. పనులు జరుగుతున్న గ్రామాల్లో కూలీలకు మంచినీరు, ప్రాథమిక వైద్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధికూలీల డబ్బులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అనేక భూసమస్యల గురించి పలువురు సబ్‌కలెక్టర్‌కు దరఖాస్తులు చేశారు.


రమేశ్‌బాబు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని

టీడీపీ కో-కన్వీనర్ రమేశ్‌బాబు మృతి

కైకలూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కైకలూరు టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు, టీడీపీ కోకన్వీనర్ తేరా రమేశ్‌బాబు(54) మృతి తీరని లోటని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాత్రి కైకలూరు మండలం వేమవరప్పాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన కైకలూరుకు అక్కడి నుంచి ఏలూరు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బీపీ బాగా పెరిగి మెదడు చిట్లిపోవడంతో మృతి చెందాడు. ఈ సంఘటన తెలుసుకున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సోమవారం ఉదయం వేమవరప్పాడు గ్రామంలో రమేష్‌బాబు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముదినేపల్లి: రమేశ్ ఆకస్మిక మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం ప్రకటించారు. రమేశ్ మరణం పట్ల నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరలమ్ము నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ తదితరులు సంతాపం తెలిపారు.

మోడల్ ప్రైమరీ పాఠశాలల కుదింపు

ముదినేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో మోడల్ ప్రైమరీ పాఠశాలల సంఖ్య తగ్గింది. మండలంలో తొలుత 12 మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేయగా, అధికారులు వాటిని తొమ్మిదికి కుదించారు. బొమ్మినంపాడు శివారు కొత్త దళితవాడ, పెనుమల్లి శివారు సింగవరం, వణుదుర్రుల్లో ఏర్పాటు చేసిన మోడల్ పాఠశాలలు రద్దయ్యాయి. వణుదుర్రు కొత్త దళితవాడ పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఏర్పాటు చేయటాన్ని ఎస్ఎంసీలు, గ్రామస్థులు వ్యతిరేకించటంతో ఆయా పాఠశాలలను బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగానే కొనసాగిస్తున్నారు. సింగవరం పాఠశాలలో 45 మంది విద్యార్థులు లేకపోవటంతో ఈ పాఠశాలను కూడ మోడల్ ప్రైమరీ పాఠశాలల జాబితా నుంచి తొలగించినట్లు ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు.

షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్



షార్ట్ ఫిల్మ్‌కు చెక్ అందచేస్తున్న కేకేఆర్

ఆగిరిపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం, తాడేపల్లి చొప్పరమెట్ల గ్రామంలో గల డాక్టర్ కేకేఆర్ హ్యాపీవ్యాలీ స్కూల్లో షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖులు పాల్గొన్నారు. థ్యాంక్ గాడ్ అనే లఘుచిత్రం ప్రథమ స్థానంలో నిలిచి లక్ష రూపాయల నగదు బహుమతిని, ద్వితీయ స్థానంలో నేస్తం అనే లఘు చిత్రం రూ.50 వేల నగదు బహుమతిని, ఉపవాసం అనే లఘుచిత్రం మూడవ స్థానాన్ని దక్కించుకుని రూ.30వేల నగదు బహుమతులను గెలుపొందాయి. పాఠశాల అధినేత డాక్టర్ కేకేఆర్ మాట్లాడుతూ షార్ట్ ఫిలిం ఫెస్టివల్లో పాల్గొన్న సభ్యులందరిని వారు చేసిన కృషిని అభినందించారు. డాట్‌కామ్ అధినేత కళాసాగర్, స్ఫూర్తి శ్రీనివాస్, వరప్రసాద్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

ఆగిరిపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి సెంటర్‌లో లైసెన్స్ లేకుండ తిరుగుతు ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించే మైనర్లను సోమవారం ఎస్సై శుభశేఖర్ అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీస్ స్టేషన్‌కు వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మారోసారి పట్టుబడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనర్ డ్రైవింగ్‌పై కేసు నమోదు

ముదినేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో పోలీసులు ఒక మైనర్ బాలుడు (17) బైక్ డ్రైవ్ చేస్తూ పట్టుబడ్డాడు. మండవల్లి మండలం అల్లినగరంకు చెందిన ఆ బాలుడిని అదుపులోకి తీసుకుని, బైక్ స్వాధీనం చేసుకున్నారు. మైనర్‌కు బైక్ ఇచ్చినందుకు ఆ బాలుడి తండ్రి ఈశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

తాగి దౌర్జన్యం చేసిన వారిపై కేసు

ముదినేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లిలోని సహాయ మాత ఇంగ్లీష్ మీడియం హైస్కూలు ఆవరణలో ఆదివారం రాత్రి జరిగిన వార్షికోత్సవం సందర్భంగా ఇద్దరు వ్యక్తులు తాగిన మైకంలో వీరంగం సృష్టించిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు. వార్షికోత్సవం జరుగుతుండగా ముదినేపల్లికి చెందిన థామస్, మరో వ్యక్తి తాగి వచ్చి కార్యక్రమంలో ఉన్న పాస్టర్, మరో పది మంది వ్యక్తులపై దౌర్జన్యం చేసి, కొట్టినట్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బొమ్మినంపాడు పంచాయతీలో రికార్డుల వివాదం

సర్పంచ్‌పై కార్యదర్శి ఫిర్యాదు

ఫిర్యాదులో వాస్తవం లేదంటున్న సర్పంచ్

ముదినేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామ పంచాయతీలో విబేధాలు కొనసాగుతూనే ఉన్నాయి. మూడేళ్ల క్రితం సర్పంచ్‌కు అప్పటి పంచాయతీ కార్యదర్శికి మధ్య వివిధ కారణాలతో ఏర్పడిన విబేధాలు మళ్లీ రచ్చ కెక్కే పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ పరిపాలన బిల్లుల చెల్లింపు తదితర అంశాలకు సంబంధించి వైసీపీ హయాంలోనే తెలుగుదేశం పార్టీకి చెందిన ఈ పంచాయతీ సర్పంచ్‌కు, కార్యదర్శికి విబేధాలు తలెత్తగా, ఇరువురూ అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించలేదు. ఎన్నికల అనంతరం అప్పటి కార్యదర్శి బదిలీ కాగా, కొత్త కార్యదర్శిగా ఎం.శ్రీనివాసు నియమితులయ్యారు. కార్యదర్శి మారినా విభేదాలు ఆగలేదు. తాజాగా ఈ నెల 25న సర్పంచ్‌పై పంచాయతీ కార్యదర్శి రికార్డులకు సంబంధించి జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పీవో, ఎంపీడీవో, ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఈ నెల 22న సర్పంచ్ దారం సుధ పంచాయతీ కార్యాలయంలో పరిశీలన కోసం తన వద్ద తీసుకున్న మినిట్స్ ఏజెండా బుక్, సభ్యుల హాజరు, ఇతర రికార్డులు తిరిగి ఇచ్చేసి, పనులకు సంబంధించిన ఎం బుక్, అంచనాలపై ఫైలు తిరిగి ఇవ్వకుండా తన వద్దే ఉంచేసుకున్నారని ఫిర్యాదు చేశారు. పాత పనులకు సంబంధించి బిల్లులు చేయాలని కూడా ఒత్తిడి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

అవాస్తవం : దారం సుధ, సర్పంచ్

పంచాయతీ కార్యదర్శి తనపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. తాను పంచాయతీ ఎం.బుక్, అంచనాల ఫైలు తీసుకోలేదు. గతంలో తాను చేసిన పనులకు సంబంధించిన ఎం బుక్ లేదంటున్నారు. దీనిపై తాను ఎంపీడీవో, డీఎల్‌పీవో, ఈవోపీఆర్‌డీలకు ఫిర్యాదు చేశా. ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

విచారణ జరుపుతాం : అశోక్, ఈవోపీఆర్‌డీ

బొమ్మినంపాడు పంచాయతీకి సంబంధించి ఎం బుక్, అంచనాల ఫైలు సర్పంచ్ ఇవ్వటం లేదని కార్యదర్శి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.